నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
శుక్రవారం | ఏప్రిల్ 12, 2024 | www.navatelangana.com

13న సీపీఐ(ఎం) జిల్లా విస్తృత స్థాయి సమావేశం

నవతెలంగాణ-నిర్మల్

ఈ నెల 13న సీపీఐ(ఎం) జిల్లా విస్తృత స్థాయి కార్యకర్తల సమావేశం నిర్వహిస్తున్నామని ఆ పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు దుర్గం నూతన్ కుమార్ అన్నారు. గురువారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. సమావేశానికి రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యురాలు పి.జ్యోతి, రాష్ట్ర కమిటీ సభ్యులు, జిల్లా ఇన్‌చార్జి అడివయ్య హాజరవుతున్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ అనుసరించే రాజకీయ విధానంపై చర్చిస్తామన్నారు. ఉదయం 11గంటలకు జరిగే సమావేశానికి కార్యకర్తలు, నాయకులు సకాలంలో హాజరై జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో పట్టణ నాయకులు డి.పోశెట్టి, చందుల సాయికిరణ్ పాల్గొన్నారు.



లక్ష్మీపూర్ చెక్‌పోస్ట్ వద్ద రూ.90వేలు పట్టివేత

నవతెలంగాణ-తలమడుగు

పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో లక్ష్మీపూర్ చెక్‌పోస్ట్ వద్ద గురువారం వాహనాలను తనిఖీ చేస్తుండగా రూ.90వేల నగదు పట్టుకున్నట్లు ఎస్సై ధనశ్రీ తెలిపారు. మహారాష్ట్ర కిన్వట్ నుండి ఆదిలాబాద్‌కు వస్తున్న మారుతి షిఫ్ట్ కారును తనిఖీ చేయగా అందులో రూ.90వేలు దొరికాయి. కారు యజమానిని గంగాధర్ సీతారాం బట్టలవార్‌గా గుర్తించారు. ఈయనది కిన్వట్ తాలూకా రాజుగాడ్ గ్రామం. ఎలాంటి ఆధారాలు లేకుండా నగదును తీసుకెళ్తుండగా పట్టుకున్నారు. తనిఖీలో ఏఎస్సై సురేందర్ పాల్గొన్నారు.



ఘనంగా ఈద్-ఉల్-ఫితర్ వేడుకలు

- ఈద్గా మైదానంలో ప్రత్యేక నమాజ్
- ముస్లిములకు శుభాకాంక్షల వెల్లువ



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రంజాన్ పర్వదినాన్ని ముస్లిములు భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. గురువారం ఉదయం ఈద్గా మైదానంలో ప్రత్యేక నమాజ్ కోసం ఏర్పాట్లు చేశారు. అర్ధరాత్రి నుంచి వర్షం కురుస్తుండడంతో ఆయా కాలనీల్లో మసీదుల్లో నమాజ్ చేశారు. ఈద్గా మైదానంలో మత పెద్దలు అల్లాహ్ గొప్పతనం, పవిత్ర గ్రంథం ఖురాన్‌లోని పలు సూక్తులను వినిపించి వాటిని ఆచారించాలని సూచించారు. మానవత్వంతో మెలిగినప్పుడే అల్లాహ్ సంతోషిస్తాడని తెలిపారు. నమాజ్ అనంతరం ముస్లిములకు ఎస్పీ గౌస్ ఆలం, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న, బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు, కాంగ్రెస్ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస్‌రెడ్డి, డీసీసీబీ చైర్మెన్ అడ్డి భోజారెడ్డి, మాజీ మున్సిపల్ చైర్పర్సన్ రంగినేని మనీషా పవన్‌రావ్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

బోథ్ : మండల కేంద్రంలోని మర్లపెల్లి రోడ్డు మార్గంలో ఉన్న ఈద్గాలో ముస్లిములు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఎమ్మెల్యే అనిల్ జాదవ్ వారికి పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

ఉపాధి పనులు సద్వినియోగం చేసుకోవాలి



నవతెలంగాణ-కెరమెరి

ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో కృష్ణారావు అన్నారు. గురువారం మండలంలోని పాట్నాపూర్, శివగూడ, జోడేఘాట్ గ్రామాల ఉపాధి కూలీలతో సమావేశం ఏర్పాటు చేశారు. జోడేఘాట్‌కు చెందిన పలువురి ఉపాధి కూలీలకు గతేడాది సంబంధించిన రెండు వారాల కూలీ వేతనాలు ఇప్పటివరకు అందలేదని ఎంపీడీవో దృష్టికి తీసుకెళ్లారు. దీంతో కూలీల ఆధార్ వివరాలను అందజేయాలని టీఏకు సూచించారు. అనంతరం ఎంపిడిఓ మాట్లాడుతూ ఇప్పటికే రెండు వారాలు పాటు నష్టపోయారని తెలిపారు. ప్రతి కూలీ వందరోజుల పని దినాలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎపిఓ మల్లయ్య, పంచాయతీ కార్యదర్శి శ్రావణ్, టీఏ నాగోరావు పాల్గొన్నారు.

గంజాయి పట్టివేత

బేల : మండలంలోని సాంగ్వి గ్రామానికి చెందిన పొచ్చిరాం వద్ద 7కిలోల గంజాయిని పోలీసులు పట్టుకున్నారు. గురువారం ఆదిలాబాద్ వైపుకు తరలిస్తుండగా పట్టుకున్నామని సిఐ సాయినాథ్ విలేకరుల సమావేశంలో తెలిపారు. సమావేశంలో ఎస్ఐ రాధిక ఉన్నారు.

మైనారిటీల అభివృద్ధికి ప్రభుత్వం కృషి



నవతెలంగాణ-ముధోల్

కాంగ్రెస్ ప్రభుత్వం మైనారిటీల అభివృద్ధికి పెద్ద పీట వేసిందని కాంగ్రెస్ ఎంపి అభ్యర్థి ఆత్రం సుగుణ అన్నారు. గురువారం రంజాన్ పండుగ సందర్భంగా ముస్లిములకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. రానున్న ఎంపి ఎన్నికల్లో తనను గెలిపించాలని కోరారు. ముధోల్ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల ఇంచార్జి రావుల గంగారెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ముత్యంరెడ్డి, నాయకులు అజీజ్, ఖాలిద్ పటేల్, అనీస్, పేరోజ్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబీకులకు జాన్సన్ నాయక్ పరామర్శ

కడెం : మృతుల కుటుంబ సభ్యులను గురువారం నియోజకవర్గ బీఆర్‌ఎస్ ఇన్‌చార్జి భుక్యా జాన్సన్ నాయక్ పరామర్శించారు. మండలంలోని పెద్దూర్‌తండా గ్రామానికి చెందిన హపావత్ నీలా గత వారం మృతి చెందింది. అదే గ్రామానికి చెందిన భూక్యా రుక్కమ్మ ఇటీవల మరణించింది. విషయం తెలుసుకున్న జాన్సన్ నాయక్ వారి ఇండ్లకెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట మండల ప్రజాప్రతినిధులు, నాయకులు ఉన్నారు.

దేవాపూర్, రుయ్యడి గ్రామాల్లో పోలీసుల కవాతు

తలమడుగు : పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో గురువారం దేవాపూర్, రుయ్యాడి గ్రామాలలో పోలీసు కవాతు నిర్వహించామని ఎస్సై ధనశ్రీ తెలిపారు. ఓటర్లు తమ ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకోవాలని మండల ప్రజలను కోరారు. సమస్యాత్మక దేవాపూర్, రుయ్యాడి గ్రామాల్లో సివిల్ పోలీసులతోపాటు సిఆర్‌పిఎఫ్ బలగాలతో వీధుల్లో కవాతు నిర్వహించామని తెలిపారు.



నారీ కటాక్షం ఎవరికి లభించేనో..?

- ఎనిమిది నియోజకవర్గాల్లో అతివల ఓట్లే అధికం
- మిగతా రెండింటిలోనూ పురుషులతో సమానం
- ప్రసన్నం చేసుకునేందుకు రాజకీయ పార్టీల పాట్లు
- ప్రభుత్వాలు సైతం వారి పేర్లతోనే పథకాలు అమలు

లోక్‌సభ ఎన్నికల్లో అతివల ఓట్లే కీలకం కానున్నాయి. వారు ఎటు వైపు మొగ్గుచూపితే ఆ పార్టీ అభ్యర్థి గెలుపు సులువుగా మారుతుంది. దీంతో ఆయా ప్రధాన పార్టీలు వారి ఓట్లను సాధించడంపైనే దృష్టి కేంద్రీకరిస్తున్నాయి. వివిధ పథకాలు అమలు చేయడంతో పాటు మరిన్ని హామీలు గుప్పించేందుకు సిద్ధమవుతుండటం ఆసక్తికరంగా మారుతోంది. ఉమ్మడి జిల్లాలోని పది నియోజకవర్గాల్లో ఏకంగా ఎనిమిదింటిలో వారిదే ఆధిపత్యం కొనసాగుతోంది. కేవలం సిర్పూర్, బెల్లంపల్లిలో మాత్రమే పురుషులతో పోల్చితే స్వల్పంగా తక్కువ సంఖ్యలో నమోదు కావడం గమనార్హం. దీంతో మహిళల ఓట్లను సాధించడమే లక్ష్యంగా ప్రధాన పార్టీలు వ్యూహాలు రచిస్తున్నాయి. వారిని ప్రసన్నం చేసుకునేందుకు రాజకీయ పార్టీలు పడరాని పాట్లు పడుతున్నాయి. ఇప్పటికే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వివిధ సంక్షేమ పథకాలను మహిళల పేరిట అమలు చేస్తుండగా.. వాటినే ఎన్నికల అస్త్రాలుగా మలుచుకొని ప్రచారం చేస్తూ మహిళల ఓట్లను పొందాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది.



నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

లోక్‌సభ ఎన్నికలపై రాజకీయ పార్టీలు దృష్టిసారించాయి. రాష్ట్రంలో అత్యధికంగా లోక్‌సభ సీట్లను గెలుచుకోవడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నాయి. ఆదిలాబాద్, పెద్దపల్లి సీట్లను సైతం కైవసం చేసుకోవాలని ఎవరికి వారు ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు. ఇప్పటికే ఆయా పార్టీల తరపున బరిలో నిలిచే అభ్యర్థులను ప్రకటించగా.. క్షేత్రస్థాయిలో ప్రచారం సైతం ప్రారంభించారు. ఉమ్మడి జిల్లాలోని ఆదిలాబాద్ లోక్‌సభ స్థానంలో సుమారు 16లక్షల ఓటర్లు ఉండగా పెద్దపల్లి ఎంపీ స్థానం పరిధిలోకి వచ్చే మిగితా మూడు నియోజకవర్గాల్లో మరో 6.50లక్షల వరకు ఓటర్లు ఉన్నారు. ఉమ్మడి జిల్లా మొత్తంగా పురుషుల కంటే మహిళల ఓట్లే అధికంగా ఉన్నాయి. ఆదిలాబాద్ లోక్‌సభ స్థానం పరిధిలో సిర్పూర్, ఆదిలాబాద్, ఆసిఫాబాద్, ఖానాపూర్, బోథ్, నిర్మల్, ముధోల్ నియోజకవర్గాలు ఉండగా వీటిలో సిర్పూర్‌లో మాత్రం వందల సంఖ్యలో మాత్రమే పురుషుల కంటే మహిళల ఓట్లు తక్కువగా ఉన్నాయి. మిగితా ఆరింటిలో అతివలే అధికంగా ఉన్నారు. మిగితా మంచిర్యాల, చెన్నూర్‌లో మాత్రం అతివల ఓట్లు అధికంగా ఉండగా.. బెల్లంపల్లిలో మాత్రం పురుషులే స్వల్ప ఆధిక్యంలో ఉన్నారు. కానీ పది నియోజకవర్గాల్లోనూ అతివల ఓట్లే అధికంగా ఉండటంతో పార్టీల విజయావకాశాల్లో వారిదే కీలక పాత్ర కానుంది.

వారి పేరుతోనే సంక్షేమ పథకాలు..!

అసెంబ్లీ ఎన్నికలు ముగిసిపోవడంతో ప్రధాన పార్టీలన్ని లోక్‌సభపై దృష్టిసారించిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో ఆయా పార్టీలు మహిళల పేరిటనే వివిధ సంక్షేమ పథకాలు సైతం అమలు చేస్తున్నాయి. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఇప్పటికే మహాలక్ష్మీ పథకంలో భాగంగా ఆర్టీసీలో ఉచిత ప్రయాణం కల్పిస్తోంది. ఒక్కోక్కరికి రూ.2500చొప్పున అందజేస్తామని ప్రకటించడంతో పాటు ఉచిత విద్యుత్తు కోసం గృహజ్యోతి పథకాన్ని అమలు చేస్తోంది. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం సైతం కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ వంటి పథకాలు అమలు చేసింది. గృహాలక్ష్మీ పేరిట ఇండ్లు కట్టిస్తామని ప్రకటించింది. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ సైతం మహిళలకు ఉచిత గ్యాస్ పంపిణీలో భాగంగా ఉజ్వల యోజన పథకాన్ని తీసుకొచ్చింది. సుకన్య సమృద్ధి యోజన వంటి పథకాలను అమలు చేస్తోంది. ఇలా ఆయా ప్రధాన పార్టీలు మహిళల పేరిట వివిధ పథకాలు ప్రవేశపెడుతూ వారి ఓట్లను ఆకర్షించే ప్రయత్నం చేస్తుండటం ఆసక్తికరంగా మారుతోంది. ఈ నేపథ్యంలో లోక్‌సభ ఎన్నికల్లో కీలకంగా మారే అతివలు ఏ పార్టీని కరుణిస్తారోననేది ఆసక్తికరంగా మారింది. వీరి ఓట్లను సాధించడమే లక్ష్యంగా పార్టీలు, అభ్యర్థులు వివిధ రకాల వ్యూహాలను రచిస్తున్నాయి.

నియోజకవర్గం	పురుషులు	మహిళలు	ఇతరులు
సిర్పూర్	1,14,484	1,14,359	12
ఆసిఫాబాద్	1,12,510	1,14,056	16
ఖానాపూర్	1,09,333	1,14,437	13
ఆదిలాబాద్	1,19,154	1,24,375	06
బోథ్	1,02,333	1,08,580	02
నిర్మల్	1,21,527	1,35,702	19
ముధోల్	1,23,234	1,30,545	18
బెల్లంపల్లి	88,802	88,530	--
మంచిర్యాల	1,38,472	1,40,559	--
చెన్నూర్	95,974	97,264	--

'కాకా' వారసునిగా వంశీ మజిలీ షురూ..!

- సామాజిక సేవా కార్యక్రమాలతో ప్రజలకు పరిచయమై..
- నిరుద్యోగులకు ఉపాధి కల్పనే లక్ష్యమంటూ ఎన్నికల బరిలో



అందరూ ఆప్యాయంగా పిలుచుకున్న ఆ నాటి కాంగ్రెస్ నేత కాకా(జి.వెంకటస్వామి) వారసునిగా మనవడు గడ్డం వంశీ పెద్దపల్లి పార్లమెంట్ స్థానం నుండి కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలో నిలిచాడు. వంశీ కృష్ణ గురించి చెప్పాలంటే ముందుగా కాకా కుటుంబ నేపథ్యాన్ని నెమరు వేసుకోవాలి. వెంకటస్వామి కుటుంబ నేపథ్యం గురించి తెలుగు రాష్ట్రాల ప్రజలకు కొత్తగా పరిచయం చేయాల్సిన పని లేదు. కాంగ్రెస్ పార్టీలో పండిత్ జవహర్‌లాల్ నెహ్రూ నుండి మొదలు ఇందిరాగాంధీ కుటుంబంలో రాజీవ్‌గాంధీ, రాహుల్ గాంధీ వరకు కాకా వెంకటస్వామి కలిసి పని చేశారు. కాంగ్రెస్ నేతగా, సీడబ్ల్యూసీ సభ్యునిగా, కేంద్ర మంత్రిగా దేశ వ్యాప్తంగా గుర్తింపు పొందిన కాకా కుటుంబ వారసునిగా ఆయన మనవడు గడ్డం వంశీకృష్ణ రాజకీయ తెరపైకొచ్చి తెలుగు ప్రజలను పలకరించబోతున్నాడు.

నవతెలంగాణ-జైపూర్

కాకా వెంకటస్వామి వారసునిగా పెద్దపల్లి పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న వంశీకృష్ణ కుటుంబ వారసత్వంగా మొదలు పారిశ్రామికవేత్తగా ఎదిగిన ఆయన ఇప్పుడు రాజకీయంగా ప్రజా సేవ వైపు అడుగులు వేస్తున్నారు. వంశీకృష్ణ తండ్రి చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి కూడా రాజకీయాల్లోకి రాకముందు వ్యాపారాలు చూస్తూ పారిశ్రామికవేత్తగా ఎదిగారు. విశాఖ ఛారిటబుల్ ట్రస్ట్ ద్వారా పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలో అనేక సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతూ కాకా కుమారునిగా ప్రజలకు పరిచయమయ్యాడు. వంశీకృష్ణ సైతం తండ్రి వివేక్ బాటలోనే పయనిస్తూ వచ్చాడు. తాత వెంకటస్వామి రాజకీయ నాయకునిగా ఉన్నప్పుడే పెద్ద తండ్రి గడ్డం వినోద్ రాజకీయాల్లోకి వచ్చారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా చెన్నూర్ అసెంబ్లీ నియోజకవర్గం నుండి పోటీ చేసి అప్పటి తెలుగుదేశం పార్టీ అభ్యర్థి బోడ జనార్ధన్‌పై విజయం సాధించాడు. కాంగ్రెస్ ప్రభుత్వంలో కార్మిక శాఖ మంత్రిగా కూడా పని చేశారు. గడ్డం వినోద్ చెన్నూర్ ఎమ్మెల్యేగా, కార్మిక శాఖ మంత్రిగా ఉన్నప్పుడు వివేక్ వెంకటస్వామి పెద్దపల్లి పార్లమెంట్ సభ్యునిగా తన తండ్రి వెంకటస్వామి స్థానాన్ని భర్తీ చేశారు. ప్రస్తుతం వంశీకృష్ణ తండ్రి వివేక్ వెంకటస్వామి చెన్నూర్ ఎమ్మెల్యేగా, పెద్ద తండ్రి వినోద్ బెల్లంపల్లి ఎమ్మెల్యేగా ప్రజలకు సేవలందిస్తున్నారు. ప్రజలకు సేవ చేయాలన్న సంకల్పంతో వంశీకృష్ణ పెద్దపల్లి నుండి కాకా వారసునిగా పరిచయం కాబోతున్నారు.

ఏడుగురు ఎమ్మెల్యేల ఏకాభిప్రాయం

పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలో గల ఏడుగురు ఎమ్మెల్యేలు గడ్డం వంశీకృష్ణ అభ్యర్థిత్వాన్ని సమర్థించారు. సునాయసమైన గెలుపు అందివ్వాలని ఆరాటపడుతున్నారు. పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలే ఉన్నారు. తండ్రితో పాటు పెద్ద తండ్రి ఎమ్మెల్యేలుగా వంశీ రాజకీయ భవిష్యత్తుకు నాంది వేయనున్నారు. వంశీ గెలుపును కాంక్షిస్తున్న పెద్దపల్లి పార్లమెంట్ పరిధి ఎమ్మెల్యేలు ఏడుగురు ఏకాభిప్రాయాన్ని వ్యక్తం చేస్తూ ఎన్నికల బరిలో అనుసరించాల్సిన వ్యూహాలకు పదును పెడుతున్నారు. ఈ క్రమంలో వంశీతో కలిసి ఏడుగురు ఎమ్మెల్యేలు పలు దఫాల్లో సమావేశమై గెలుపు తథ్యమనే సంకేతాన్నిస్తున్నారు. మొదటిసారి ఎన్నికల బరిలో ఉన్న వంశీకృష్ణకు గెలుపు అవకాశాలు ఎక్కువగా కన్పిస్తున్నాయి. తన తండ్రితో పాటు పెద్ద తండ్రి మిగతా పార్లమెంట్ పరిధి ఎమ్మెల్యేలు ఐదుగురు ఎమ్మెల్యేలు ఏకతాటిపైకి వచ్చి వంశీని గెలిపించుకోవాలనే కృత నిశ్చయంతో ఉన్నారు. దీనికి తోడు వంశీకృష్ణ తమ విశాఖ ఛారిటబుల్ ట్రస్టు ద్వారా సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టడం, యువకుడిగా ఉండి కార్యకర్త నుండి మొదలు ప్రతి ఒక్కరితో సఖ్యత పెంచుకోవడం ఆయనకు కలిసి వస్తోంది. ప్రస్తుత రాజకీయ వాతావరణం అసెంబ్లీ ఎన్నికలతో పోల్చిచూసే పరిస్థితి కన్పించడం లేదు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్, బీఆర్‌ఎస్ మధ్య పోటీ కన్పించింది. ప్రస్తుతం రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉంది. ఇది కూడా వంశీకృష్ణకు కలిసి వచ్చే అంశంగా ఉంది.

నిరుద్యోగులకు ఉపాధి కల్పించడమే లక్ష్యంగా..

పెద్దపల్లి పార్లమెంట్ నుండి కాకా మూడవ తరం వారసునిగా రాజకీయాల్లోకి వస్తున్న వంశీకృష్ణ పారిశ్రామికవేత్తగా పరిణితి పొందాడు. నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించడమే ప్రధాన లక్ష్యంగా ప్రజల ముందుకు వస్తున్నారు. చెన్నూర్ ఎమ్మెల్యే అభ్యర్థిగా ఎన్నికల బరిలో నిలిచిన వంశీ తండ్రి గడ్డం వివేక్ వెంకటస్వామి నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించడం కోసం తమ వంతు కృషి ఉంటుందని ప్రజలకు హామీ ఇచ్చారు. ఆ హామీని నెరవేర్చే ప్రక్రియ ఇటీవల ప్రారంభించారు. అదేబాటలో వివేక్ తనయుడు వంశీకృష్ణ సైతం నిరుద్యోగుల ఉపాధి అవకాశాలపై దృష్టి సారించారు.

ఉపాధి కూలీలపై తేనె టీగల దాడి

- సుమారు 40మందికిపైగా గాయాలు
- బేల మండలం రేణిగూడ ప్రాంతంలో ఘటన
- క్షతగాత్రులను రిమ్స్‌కు తరలింపు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్, బేల

ఉపాధి హామీ కూలీలపై తేనె టీగలు దాడి చేసిన ఘటన బేల మండలంలో చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో సుమారు 40మందికిపైగా గాయపడ్డారు. మొదట వారికి ఉపాధి హామీ సిబ్బంది, స్థానికులు కలిసి సైద్‌పూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించి ప్రాథమిక చికిత్స అందించారు. అక్కడి నుండి మెరుగైన చికిత్స కోసం అంబులెన్సులలో జిల్లా కేంద్రంలోని రిమ్స్‌కు తరలించారు. రేణిగూడ అటవీ ప్రాంతంలో ఈ ఘటన చోటుచేసుకుంది. కూలీలు ఎప్పటిలాగే గురువారం ఉదయం పూట పనులకు వెళ్లారు. ఎవరి పనుల్లో వారు నిమగ్నమై ఉండగా ఒక్కసారిగా తేనె టీటలు మీదకు దూసుకు వచ్చాయి. దాదాపు అక్కడున్న 120 మంది కూలీల్లో 40మంది వరకు గాయాలపాలయ్యారు. వెంటనే అప్రమత్తమైన స్థానికులు, ఉపాధిహామీ సిబ్బంది వారిని పీహెచ్‌సీకి తరలించారు. ఈ విషయం తెలిసిన కలెక్టర్ రాజర్షి షా వెంటనే స్పందించి ఐదు అంబులెన్స్‌లను అక్కడకు పంపించారు. అందులో వారిని హుటాహుటిన రిమ్స్‌కు తరలించారు. మెరుగైన వైద్యసేవలు అందించాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఆస్పత్రికి వచ్చిన బాధితులకు రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్, డీఎంహెచ్‌ఓ డాక్టర్ నరేందర్ రాథోడ్ ఆధ్వర్యంలో వైద్య సేవలు ప్రారంభించారు. ఎవరికి ఎటువంటి ప్రమాదం లేదని డైరెక్టర్ తెలిపారు.

ఉపాధి కూలీలకు పలువురి పరామర్శ

రిమ్స్‌లో చికిత్స పొందుతున్న ఉపాధి కూలీలను మాజీ మంత్రి జోగు రామన్న పరామర్శించారు. వారి పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వైద్యులతో చర్చించి మెరుగైన వైద్యం అందించాలని కోరారు. అనంతరం మాట్లాడుతూ కూలీలకు ప్రమాదం సంభవించినప్పుడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆర్థిక సాయం అందించే సౌకర్యం ఉంటుందన్నారు. ఉపాధి హామీ కూలీలను ప్రభుత్వాలు పూర్తిగా విస్మరిస్తున్నాయని తెలిపారు. ఉపాధి కూలీల సమస్యల పరిష్కారానికి కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తామన్నారు. గాయపడిన కూలీలు పూర్తిగా కోలుకునేవరకు కూలీ కట్ చేయకుండా పూర్తిగా చెల్లించాలని డిమాండ్ చేశారు. పరామర్శించిన వారిలో నాయకులు ఇజ్జగిరి నారాయణ, యాసం నర్సింగ్‌రావు, సతీష్, కౌన్సిలర్ భూమన్న, రాజేష్, రమేష్ ఉన్నారు.



పరామర్శిస్తున్న మాజీ మంత్రి జోగు రామన్న

ఎమ్మెల్యే పాయల్ శంకర్ సైతం కూలీలను పరామర్శించి మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు, సిబ్బందికి సూచించారు. కాంగ్రెస్ ఆదిలాబాద్ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాస్‌రెడ్డి సైతం బాధితులను పరామర్శించారు. కాంగ్రెస్ నాయకులతో కలిసి ఆస్పత్రికి చేరుకుని అందుతున్న వైద్య చికిత్సలపై ఆరా తీశారు. మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లకు సూచించారు. ఆయనతో పాటు సుభాష్‌నగర్ కౌన్సిలర్ దర్శనాల లక్ష్మణ్, మాజీ జడ్పీటీసీ కొండ గంగాధర్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు బాయిన్‌వార్ గంగారెడ్డి, గిమ్మ సంతోష్, రాజ్ మహమ్మద్ తదితరులున్నారు.

మెరుగైన వైద్యం అందించాలి : టీఏజీఎస్

తేనె టీగల దాడిలో గాయపడిన ఉపాధి కూలీలకు మెరుగైన వైద్యం అందించాలని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం(టీఏజీఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూసం సచిన్ డిమాండ్ చేశారు. గాయపడిన వారిని వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు ఆశన్నతో కలిసి రిమ్స్‌లో పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పని ప్రదేశాల్లో కూలీలకు రక్షణ కల్పించడంలో అధికారులు విఫలమయ్యారన్నారు. బాధిత కుటుంబాలకు నష్టపరిహారం అందించి మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లను కోరారు. ఉపాధి కూలీల భద్రతకు ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు.



బాధితులను పరామర్శిస్తున్న టీఏజీఎస్ నాయకులు



బాధితుడిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే పాయల శంకర్

రూ.లక్ష నగదు పట్టివేత

నవతెలంగాణ-బేల

అంతర్ రాష్ట్ర సరిహద్దు శంకర్‌గూడ చెక్‌పోస్ట్ వద్ద పోలీస్ వాహన తనిఖీల్లో భాగంగా ఎంహెచ్ 34 బీఎఫ్ 7409 నెంబర్ గల వాహనదారుడు వైభవ్ తన కారులో కోర్పణ నుంచి పాటన్ బోరి వెళుతున్న సమయంలో రూ.ఒక లక్ష నగదును పట్టుకున్నారు. సరియైన ధృవపత్రాలు లేనందున నగదును సీజ్ చేసినట్టు ఎస్సై రాధిక తెలిపారు.



అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ పట్టివేత

నవతెలంగాణ-కడెం

ప్రభుత్వ ఆదాయానికి నష్టం కల్గిస్తూ, ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా చిట్యాల్ గోదావరి నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ని బెల్లాల్ గ్రామ శివారులో కడెం పోలీసులు పట్టుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించి, కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు కడెం ఎస్సై ఎం.కృష్ణ సాగర్‌రెడ్డి తెలిపారు.



భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవడమే పూలేకు ఘనమైన నివాళి

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేష్



ఆదిలాబాద్‌టౌన్‌లో..

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

భారత రాజ్యాంగాన్ని కాపాడు కోవడమే జ్యోతిభా పూలేకు ఘనమైన నివాళి అని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేష్ ప్రజలకు పిలుపునిచ్చారు. గురువారం జ్యోతిభా పూలే 197వ జయంతిని పురస్కరించుకుని, పట్టణంలోని బీసీ, ఎస్సీ సంక్షేమ శాఖ ఆవరణలో ఉన్న జ్యోతిభా పూలే, సావిత్రిబాయి పూలే, విగ్రహాలకు పూలమాలలు వేసి జయంతి వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా మల్లేష్ మాట్లాడుతూ సామాజిక న్యాయం, కుల, మత తారతమ్యాలు లేని సమాజాన్ని స్థాపించడం జ్యోతిభా పూలే ఆశయమని అన్నారు. సామజిక న్యాయం కల్పించిన భారత రాజ్యాంగాన్ని సమూలంగా మార్చిదాని స్థానంలో కుల, మత విద్వేషంతో కూడిన మనుధర్మాన్ని ప్రవేశ పెట్టడం బీజేపీ లక్ష్యమని అన్నారు. అదేగాని జరిగితే దేశ ప్రజలు పీష్వాల రాజ్యం నాటి కాలానికి నెట్టివేయ బడుతారని ఆవేదన వ్యక్తం చేశారు. మళ్లీ బీజేపీ అధికారంలోకి వస్తే జరిగేది ఇదేనన్నారు. ప్రజలు అప్రమత్తమై వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని ఓడించి, భారత రాజ్యాంగాన్ని రక్షించుకోవాలని పిలుపునిచ్చారు. అప్పుడే సామజిక ఉద్యమ విప్లవకారుడు జ్యోతిభా పూలేకు ఘనమైన నివాళ్లు అర్పించిన వాళ్లమవుతామని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు అన్నమొల్ల కిరణ్, పూసం సచిన్, సీఐటీయూ జిల్లా అధ్యక్షులు బొజ్జ ఆశన్న, ఉపాధ్యక్షులు అగ్గిమల్ల స్వామి నాయకులు కే.ఆశన్న పాల్గొన్నారు.

టీఏజీఎస్ ఆధ్వర్యంలో...

దేశ ప్రజల్లో మతం ఆధారంగా విభజిస్తూ, రాజ్యాంగాన్ని మార్చి మనువాదన్ని ప్రవేశ పెట్టాలని చూస్తున్న బీజేపీని లోక్‌సభ ఎన్నికల్లో ఓడించడమే ఆ మహనీయునికి మనం ఇచ్చే ఘన నివాళి అని టీఏజీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు తొడసం భీంరావు, ఐద్వా జిల్లా సహాయ కార్యదర్శి ఆర్.మంజుల అన్నారు. గురువారం సీఐటీయూ కార్యాలయంలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో మహాత్మా జ్యోతిభా పూలే 197వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ముందుగా పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహాత్మా జ్యోతిభా పూలే ఈ దేశంలో అన్ని వర్గాల సమానత్వానికై, సామాజిక ఉద్యమాలు, స్త్రీ సమానత్వానికి అహర్నిశలు పోరాడారని కొనియాడారు. ఆయన రచించిన గులాం గిరి పుస్తకంలో మనువాదం ఈ దేశానికి ప్రమాద కరమని ఆనాడే హెచ్చరించారని అన్నారు. నేడు కేంద్రంలోని బీజేపీ భారత రాజ్యాంగం స్థానంలో మనువాదన్ని తేవాలని చూస్తోందని ఆరోపించారు. అందుకే అటువంటి బీజేపీని ఈ లోక్‌సభ ఎన్నికల్లో ఓడించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బొజ్జ ఆశన్న, అన్నమొల్ల కిరణ్, టీఏజీఎస్ కార్యదర్శి పూసం సచిన్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఆశన్న, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు అగ్గిమల్ల స్వామి పాల్గొన్నారు.

ఏఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో...

స్వతంత్ర భారతానికి వందేళ్ళ ముందే బడుగు బలహీన వర్గాలచే మహాత్ముడిగా జన నీరాజనాలు అందుకున్న గొప్ప సామాజిక కార్యకర్త, మేధావి, కుల వ్యతిరేక సామాజిక సంస్కర్త జ్యోతిబాపూలే అని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి మెస్రం భాస్కర్ అన్నారు. జ్యోతిరావు పూలే 197వ జయంతిని పురస్కరించుకుని ఎస్సి, బిసి కార్పొరేషన్ లో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మెస్రం భాస్కర్ మాట్లాడుతూ. మహాత్మా జ్యోతిరావ్ పూలే జయంతి సందర్భంగా ఆయన త్యాగాలను, సమాజానికి చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. ఒక సామాన్యుడిగా మొదలై ఒక సామాజిక ఉద్యమ కెరటంగా ఎదిగిన పూలే జీవితం అందరికీ ఆదర్శనీయమన్నారు. సామాజిక కార్యకర్తగా, వర్ణ వివక్షకు వ్యతిరేకంగా పోరాడిన సంఘ సంస్కర్త పూలే భావి తరాలకు సైతం మార్గదర్శకుడని గుర్తుచేసుకున్నారు. వెనుకబడినవర్గాలు, దళిత జనోద్ధరణకు ఆయన ఎంచుకున్న బాట, అనుసరించిన మార్గం సమాజ శ్రేయస్సును కాంక్షించే వారందరికీ స్ఫూర్తిగా నిలుస్తుందన్నారు. జ్యోతిరావు పూలే సామాజికోద్యమాలకు ఆద్యుడని వారు గుర్తు చేశారు. స్వేచ్ఛ, సమానత్వ, ఐక్యమత్య సమాజం కోసం అనునిత్యం శ్రమించిన మహనీయుడన్నారు. సమాజంలో సగభాగమైన స్త్రీలు నిరక్షరాస్యులు అయితే ఈ సమాజం ఎలా అభివద్ధి చెందుతుందని నాడు ప్రశ్నించారని, స్త్రీలు విద్యావంతులు కావాలని ముందుగా తన భార్య సావిత్రీ బాయిని పాఠశాలకు పంపి అందరికీ ఆదర్శంగా నిలిచాడన్నారు. అంతేగాక అన్ని కులాల వారు చదువుకునేలా పాఠశాలలను స్థాపించి, విద్యాభివద్ధికి కషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా నాయకులు అంబ్బడి నరేందర్, కష్ణ, మురళి, రాజశేఖర్, రమేష్, రఘు, శ్రీకాంత్, ఆర్యన్, పాల్గొన్నారు.

టీఎస్ఎఫ్ ఆధ్వర్యంలో...

తెలంగాణ స్టూడెంట్ ఫోరం సొసైటీ ఆధ్వర్యంలో మహాత్మ జ్యోతిభా పూలే 197వ జయంతిని నిర్వహించారు. గురువారం పట్టణంలోని ఎస్సీ, బీసీ కార్యాలయ ఆవరణలో మహాత్మ జ్యోతిభా పూలే విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మహాత్మ జ్యోతిభా పూలే ఆశయాలను విద్యార్థులు యూత్ ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. వారి ఆశయల సాధన కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు బి.రాహుల్, ఉపాధ్యక్షులు సంతోష్, ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, సహాయ కార్యదర్శి మీరా రాకేష్, మండల అధ్యక్షులు నాగార్జున పాల్గొన్నారు.

సీపీఐ(ఎంఎల్) ఆధ్వర్యంలో..

మహాత్మ జ్యోతిభా పూలే ఆశయాల సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సీపీఐ(ఎంఎల్), మాస్‌లైన్ (ప్రజాపంథా) జిల్లా నాయకులు జగన్ సింగ్ కోరారు. మహాత్మ జ్యోతిభా పూలే జయంతి సందర్భంగా జిల్లా కేంద్రంలో బీసీ స్టడీ సర్కిల్ ప్రాంగణంలోని విగ్రహానికి పూలమాలవేసి నివాళు లర్పించారు. అనంతరం వారు మాటాడుతూ స్వాతంత్ర్యం రాకమునుపే మహారాష్ట్రలో బ్రాహ్మణ మనువాద భావాజాలానికి వ్యతిరేకంగా పూలే కృషి చేశారని కొనియాడారు. నిమ్న వర్గాలకి చదువు నేర్పేందుకు స్వయంగా పాఠశాల ఏర్పాటు చేసే విజ్ఞానవంతులుగా తీర్చిదిద్దారని అన్నారు. పూలే తన భార్య అయిన సావిత్రిబాయికి చదువు నేర్పి దళిత మహిళలకు పాఠశాలలను ఏర్పాటు చేసి దేశానికి మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలిని అందించిన గొప్పవాడని కీర్తించారు. సమాజంలో ఉన్న కుల అంతరాలకు వ్యతిరేకంగా సత్యశోధకు సమాజాన్ని ఏర్పాటు చేసి జీవితాంతం కుల మతాలకు వ్యతిరేకంగా పోరాటం చేసిన యోధుడు జ్యోతిభా పూలే ఆశయాలను సాధించేందుకు ప్రతి ఒక్కరూ ఆయన అడుగుజాడల్లో ముందుకు సాగాలని కోరారు. ఈ కార్యక్రమంలో నితిన్, అశోక్, సాయి కుమార్, వినోద్, సచిన్, పర్వీన్ పాల్గొన్నారు.

ఏఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో...

అంటరానితనాన్ని ఎండగట్టిన గొప్ప సంఘసంస్కర్త, సమసమాజ స్థాపనలో భావి తరాలకు నిత్య స్ఫూర్తి ప్రధాతగా మహాత్మా జ్యోతిభా పూలే నిలిచారని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి గెడం కేశవ్ అన్నారు. గురువారం పూలే జయంతి సందర్భంగా వారి సేవలు స్మరించుకుంటూ, వారికి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అంబడి నరేందర్, మాణిక్, దినేష్, టాపరే, తులసి పాల్గొన్నారు.

అంబేద్కర్ సంఘాల ఐక్య పోరాట సమితి ఆధ్వర్యంలో...

అంబేద్కర్ సంఘాల ఐక్య పోరాట సమితి ఆధ్వర్యంలో మహాత్మ జ్యోతిరావు పూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. గురువారం పట్టణంలోని బీసీ స్టడీస్ సర్కిల్ ఆవరణంలో ఉన్న మహాత్మ జ్యోతిభా పూలే విగ్రహానికి అంబేద్కర్ సంఘాల ఐక్య పోరాట సమితి నాయకులు సంఘ సభ్యులు పాల్గొని ఘనంగా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే ఎస్సీ కార్పొరేషన్ ఆవరణంలోని మహాత్మ జ్యోతిభా పూలే, సావిత్రిబాయి పూలే విగ్రహాలకు పూలతో ఘనంగా నివాళు లర్పించారు. కార్యక్రమంలో అంబేద్కర్ ఐక్య పోరాట సమితి జిల్లా అధ్యక్షులు అల్లూరి భూమన్న, జిల్లా ప్రధాన కార్యదర్శి దర్శనాల నగేష్, రాజన్న, పెంటపర్తి ఉశన్న, కొల్లూరి శంకర్, ప్రభాకర్, సంఘ నాయకులు పాల్గొన్నారు.

కిసాన్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో...

బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి, స్త్రీ జనోద్ధారకుడు మహాత్మా జ్యోతిభా పూలే అని తెలంగాణ రాష్ట్ర కిసాన్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. గురువారం పూలే జయంతిని పురస్కరించుకుని దస్నాపూర్‌లోని బీసీ స్టడీ సర్కిల్ ఆవరణలో ఉన్న పూలే విగ్రహానికి పార్టీ నాయకులు, కార్యకర్తలతో నివాళులర్పించారు ఈ సందర్భంగా శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ దేశంలో బీసీ బడుగు బలహీన అణగారిన కులాల వారికి విద్యను అందించారని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మావల అధ్యక్షులు ధర్మపురి, చంద్రశేఖర్, దామోదర్‌రెడ్డి, నాగరాజు, రంజిత్, వెంకటేష్ ఉన్నారు.

తలమడుగు : మాల సంక్షేమ సంఘం మండల శాఖ ఆధ్వర్యంలో గురువారం మహాత్మా జ్యోతిభా పూలే 197వ జయంతి వేడుకలను మండల కేంద్రంతో పాటు బరంపూర్, కుచులాపూర్, లింగి గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాల సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు గూకుంటి క్రాంతి కుమార్, ప్రధాన కార్యదర్శ నిమ్మల గజానన్ మాట్లాడుతూ జ్యోతిభా పూలే, సావిత్రి పూలే చేసిన సేవలను ఈ సందర్భంగా కొనియాడారు. ఈ కార్యక్రమంలో మాల సంక్షేమ సంఘం నాయకులు నేతుల గంగన్న, ఎలుగు చంటి, రమేష్, దేవన్న, రాకేష్, శశివర్ధన్, ఆనంద్, రవి, సంటి, సూర్యప్రకాష్, నారాయణ, వేణు, దీపక్, రవి, నరేష్, శంకర్, వెంకన్న, శ్రీనివాస్, దేవన్న, యాదగిరి, పలువురు పాల్గొన్నారు.

మాలి సంఘం ఆధ్వర్యంలో...

భారతదేశంలో సామాజిక విప్లవానికి నాంది పలికి దేశంలో ఉన్న బడుగు బలహీన వర్గాలకు సామాజిక న్యాయం అందించేలా కృషిచేసిన మహోన్నత వ్యక్తి మహాత్మ జ్యోతిభా పూలే అని అఖిల భారతీయ మాలి మహా సంఘం రాష్ట్ర అధ్యక్షులు సుకుమార్ పేట్కులే అన్నారు. గురువారం బరంపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన మహాత్మ జ్యోతిభా పూలే 197వ జయంతి కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొని ఏర్పాటుచేసిన సభలో పూలే దంపతుల చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ1848 వ సంవత్సరంలో జ్యోతిభా పూలే దంపతులు స్త్రీ విద్యకు నాంది పలికారని, సమసమాజ నిర్మాణం కోసం కృషి చేశారని అన్నారు. ఆ మహనీయుల కృషితోనే దేశంలో సామాజిక న్యాయం పొంది రిజర్వేషన్ ఫలాలు అనుభవిస్తున్నారని అన్నారు. వారి జీవిత చరిత్రను తెలుసుకొని బహుజన కులాలు వారి హక్కుల కోసం పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వెంకటేశ్వర ఆలయ కమిటీ అధ్యక్షులు ముడుపు కేదారేశ్వర్‌రెడ్డి, గ్రామ పెద్దలు ఆశన్న, మండల బీసీ సంఘం అధ్యక్షులు రమాకాంత్, శ్రీనివాస్, మాలి మహా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాంబన్న షిండే, కోశాధికారి సతీష్ గురునులే, అనిల్, గురునూలే గంగారాం, వినోద్ గురునులే, విలాస్ గురునులే, రమేష్, పురుషోత్తం, మాలి సంఘ నాయకులు గ్రామస్తులు పాల్గొన్నారు.

నార్నూర్ : మహాత్మ జ్యోతిబా పూలే చేసిన త్యాగాలు మరువలేనివనీ పుష్కర్ సాగర్ అన్నారు.గురువారం మండల కేంద్రంలోని గణేష్ మోతేవాడ్ అర్ఎంపి క్లినిక్ లో జ్యోతిబా పూలే 198 జయంతిని ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు.అనంతరం పూలే చేసిన సేవలను కొనియాడారు.కార్యక్రమంలో కాంబ్లె దయానంద్, జనార్ధన్ గుట్టే, మాహాత్మె గులాబ్, మహాత్మె కిషన్ తదిరులు పాల్గొన్నారు.

నేరడిగొండ : మహాత్మ జ్యోతిభా పూలే 197వ జయంతిని పురస్కరించుకొని, మండలంలోని గుత్పాల గ్రామంలో అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో గురువారం జ్యోతిభా పూలే జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అధ్యక్షుడు దావుల దినేష్, ప్రధాన కార్యదర్శి లింగంపెల్లి సురేష్, కోశాధికారి ఊడుగు అభిలాష్, కార్యదర్శి ఒడ్డెపెల్లి సురేష్, సింగరం లస్మన్న, గ్రామస్తులు పాల్గొన్నారు.

బేల : మండలంలోని టాక్లీ గ్రామంలో గురువారం జ్యోతిభా పూలే జయంతి వేడుకలను మాలీ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు రాకేష్ బన్కర్, నరేంద్ర, రాహుల్, హరీష్, వికాస్, సుమిత్, రాజు, అమోల్ పాల్గొన్నారు.



ఆదిలాబాద్‌టౌన్: అంబేద్కర్ సంఘాల ఐక్య పోరాట సమితి ఆధ్వర్యంలో..




తలమడుగులో..



నార్నూర్‌లో..

రంజాన్ పండుగకు పేద ముస్లిముల ఇంటికి ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు

- భోజనం చేసి సమస్యలు తెలుసుకున్న వెడ్మ బొజ్జు పటేల్



ఉట్నూర్‌లో..

నవతెలంగాణ-ఉట్నూర్

రంజాన్ పండుగ వేళ ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ పేద ముస్లింల ఇంటి వెళ్లి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. దీంతో వారి ఇంటికి ఎమ్మెల్యే రావడంతో వారి సంతోషానికి అవదులు లేకుండా పోయాయి. నిత్యం ప్రజా సమస్యల పట్ల బీజీగా ఉండే ఎమ్మెల్యే ఇలా వచ్చి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన బోజనం చేసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఉట్నూర్ పట్టణంలోని మోమీన్‌పుర కాలనీలో వెళ్లి అల్లా బకాష్ అనే కూలీ ఇంటికి వెళ్లారు. ఆకస్మికంగా ఎలాంటి సమాచారం లేకుండా తమ వాకిట్లో అడుగు పెట్టిన ఎమ్మెల్యేను చూసి పేద కుటుంబం ఆనందం వ్యక్తం చేసింది. వారి కుటుంబ సభ్యులతో కలిసి భోజనం చేశారు. అనంతరం వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రెండు గదులున్న ఇంట్లో ఐదు కుటుంబాలు నివసిస్తున్నాయని అల్లా బకాష్ ఎమ్మెల్యేకు తెలిపారు. తనకు పెన్షన్ రావడం లేదన్నారు. తాను ఉన్నానని ఎమ్మెల్యే ఆ కుటుంబానికి భరోసా ఇచ్చారు. ఇంటి భూమితో పాటు ఇందిరమ్మ ఇల్లు, పెన్షన్ మంజూరు చేస్తానని భరోసా ఇచ్చారు.

ఆదిలాబాద్ రూరల్ : ఆదిలాబాద్ మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో గురువారం రంజాన్ పండుగను ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేసి, అలైబలై చేసుకొని శుభకాంక్షలు తెలుపుకున్నారు.

మావలలో...

మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో రంజాన్ పండుగ వేడుకలు అంబరాన్నంటాయి. కుల మతాలకతీతంగా చిన్న పెద్ద తేడా లేకుండా ప్రతి ఒక్కరూ భక్తిశ్రద్ధలతో పండుగను జరుపుకున్నారు. ఒకరినొకరు అలింగనం చేసుకుంటూ ఈద్ ముబారక్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

తాంసి : నెల రోజులు రంజాన్ మాసం పురస్కారించుకొని కఠొర ఉపవాసాలు చేసిన ముస్లింలు గురువారం పవిత్రమైన రంజాన్ పండుగ సందర్భంగా తాంసి, భీంపూర్ మండలాలకు చెందిన ముస్లింలు ఉదయాన్నే నూతన బట్టలు ధరించి, చిన్న పెద్ద తేడా లేకుండా గ్రామాల్లో ఉన్న మజీద్‌లకు చేరుకొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఖురాన్ ప్రవచనాలను బోధించారు. అనంతరం ముస్లింలకు వివిధ పార్టీలకు చెందిన ప్రజాప్రతినిదులు ఒకరికొకరు అలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలిపారు.

లక్ష్మణచాంద : మండలంలోని ఆయా గ్రామాల్లో గురువారం రంజాన్ పండుగ వేడుకలు ఘనంగా నిర్వహించుకున్నారు. ముస్లింలు ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఒకరికొకరు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు.

తలమడుగు : రంజాన్ పండుగను పురస్కరించుకొని గురువారం మండలంలోని రుయ్యాడి గ్రామంలో హస్సేన్ హుస్సేన్ బంగ్లా వద్ద సేమియాలు పంపిణీ చేశారు. గత కొద్ది సంవత్సరాలుగా రుయ్యాడి గ్రామంలో ప్రతి ఏటా గ్రామస్తులు కలిసిమెలసి రంజాన్ పండగ పర్వదిన సందర్భంగా సేమియాలు పంపిణీ చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో గ్రామస్తులు పోతారెడ్డి, సుదర్శన్‌రెడ్డి, గంగాధర్, మోతె శ్రీనివాస్, సాయి, ప్రవీణ్, లక్ష్మారెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.



కడెంలో..

కడెం : మండల కేంద్రంతో పాటు మండలంలోని కొండుకూర్, పెద్ద బెల్లాల్, లింగాపూర్ మాసాయిపేట్, ఎలగడప గ్రామాల్లో ఈద్-ఉల్-ఫితర్ రంజాన్ పండుగ వేడుకలను ముస్లిం మైనారిటీలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం ఆయా ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం వారికి ముస్లిం పెద్దలు ప్రవచనాలు బోధించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఒకరినొకరు అలైబాలై తీసుకుంటూ స్వీట్లు తినిపించుకుంటూ రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

నార్నూర్ : రంజాన్ పవిత్ర మాసం ముగింపు సందర్భంగా గురువారం మండల కేంద్రంతో పాటు నాగల్‌కొండ, ఇలియాస్ నగర్, తాడిహత్నూర్‌తో పాటు ఆయా గ్రామాల్లో ముస్లింలు ఈద్ ఉల్ ఫితర్ రంజాన్ పండుగను ఘనంగా నిర్వహించారు. ముందుగా ఈద్గా వద్ద మజీద్‌లో చిన్న పెద్ద తేడా లేకుండా ప్రార్థన చేశారు. అనంతరం ఒకరి నొక్కరు కలిసి ఆలింగనం చేసి శుభాకాంక్షలు తెలిపారు. రుచికరమైన సేమియా పాయాసం తినడానికి మిత్రులకు కుటుంబసభ్యులకు ఆహ్వానం పలికారు. కార్యక్రమంలో సదర్ ఖదీర్, నాయబ్ సదర్ మొహమ్మద్ ఖురేషి, హాజీ హసన్‌ఖాన్, కోఆప్షన్ మెంబర్ దస్తగిర్, సయ్యద్ ఖాసిం, ఫిరోజ్ ఖాన్, బాబాఖాన్, దాదే ఆలీ, జాకీరుల్ల ఖాన్, షేక్ అహ్మద్, కరీం ఖాన్, సత్తార్, మీసేవా నిర్వాహకులు సయ్యద్ మొబీన్, బడేఖాన్, మసూద్, నౌసద్, అవెజ్, నయ్యూమ్, అజహర్, అవేజ్ ఉన్నారు.

ఇంద్రవెల్లి : భక్తి శ్రద్ధలతో ముస్లింలు ఈద్ ఉల్ ఫితర్ పండగను జరుపుకున్నారు. ఒక నెల పాటు పవిత్ర ఉపవాస దీక్షలు చేపట్టిన అనంతరం నెలవంక కనిపించడంతో ముస్లింలు పండుగను ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా కొత్త బట్టలను ధరించి ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఒకరికొకరు అలింగనం చేసుకొని పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.

నేరడిగొండ : మండల కేంద్రంలో గురువారం రంజాన్ పండుగను పురస్కరించుకొని భక్తి శ్రద్ధలతో ఈద్గా వద్ద ముస్లింలు సామూహికంగా ప్రత్యేక ప్రార్థనలు చేసి ఖురాన్‌ను పఠించారు. అనంతరం అలైబలై చేసుకొని శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

కుభీర్ : మండల కేంద్రంతో పాటు పార్డి(బి), పల్సి, సోనారి, గోడపూర్, మలేగాం, నిగ్వతో పాటు ఆయా గ్రామాల్లో గురువారం ముస్లింలు రంజాన్ పండుగను ఘనంగా నిర్వహించుకున్నారు. నెల రోజుల నుంచి ఎంతో పవిత్రంగా కఠోర ఉపవాస దీక్షలు చేపట్టి గురువారం ఉదయం ఆయా గ్రామాల్లో ఉన్న ఈద్గల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేసి, ఒకరికొకరు రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ సందర్భంగా మండల నాయకులు ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపి స్వీట్లు తినిపించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మోహియోద్దీన్, పుప్పుల పీరాజి, నగలింగం విజయ్ కుమార్, రఫీక్, అఫ్సర్‌ఖాన్, ముజాహిద్ ఖాన్, గఫర్, ఏకినోద్దీన్ వివిధ పార్టీలకు చెందిన మండల నాయకులు, గ్రామస్తులు ఉన్నారు.

సిరికొండ : మండల కేంద్రంలో గురువారం రంజాన్ పండుగ వేడుకలను ముస్లింలు ఘనంగా జరుపుకున్నారు. ఉదయం మసీద్‌లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. చిన్న, పెద్ద తేడా లేకుండా ఒకరికొకరు ఆలింగనం చేసుకొని, రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

ముధోల్ : మండల కేంద్రంతో పాటు మండలంలోని తరోడా, ఎడ్‌బిడ్, మచ్కల్, ఆష్టా, తదితర గ్రామాల్లో గురువారం మైనార్టీలు రంజాన్ పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఒకరికొకరు రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. పండుగ సందర్భంగా ముధోల్ సీఐ మల్లేష్ నేతృత్వంలో ఎస్సై సాయికిరణ్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు నిర్వహించారు.

తలమడుగు : రంజాన్ పండుగను పురస్కరించుకొని గురువారం మండలంలోని ఉండం, సుంకిడి, ఖోడద్, తలమడుగు గ్రామాల్లో ముస్లింలు ఘనంగా నిర్వహించుకున్నారు. ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేసి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ గోక గణేష్‌రెడ్డి, మండల కాంగ్రెస్ నాయకులు కళ్యాణం రాజేశ్వర్, ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఉపవాస దీక్షలతో నెల రోజులుగా రోజు క్రమం తప్పకుండా నమాజ్ చేస్తూ, ఉండటం గొప్ప విషయమని అన్నారు. శుభాకాంక్షలు తెలిపిన వారిలో వెంకన్న, మైనార్టీ సెల్ అధ్యక్షులు రఫిక్, ఎస్సీ సెల్ అధ్యక్షులు అశోక్, వెంకటేష్, బాలాజీ, ప్రవీణ్‌రెడ్డి, గాజుల సాంబశివ్, పోతన్న, సాయి, రాకేష్, దేవన్న, సంతోష్, సుదర్శన్, అప్సర్ పాల్గొన్నారు.

ఉట్నూర్ : ఈద్ ఉల్ ఫితర్ వేడుకలను ముస్లింలు గురువారం ఘనంగా నిర్వహించుకున్నారు. మండల కేంద్రంలోని ఈద్గా మైదానం వద్ద ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ప్రార్థన అనంతరం ముస్లింలు ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఆత్మీయ ఆలింగనం చేసుకుంటూ శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రతి ఒక్కరు ఆనందోత్సవాల మధ్య రంజాన్ వేడుకలను ఘనంగా జరుపుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జ్యూస్‌లను పంపిణీ చేసిన కేశవ్...

పవిత్ర రంజాన్ శుభ సందర్భంగా గురువారం ఉట్నూర్‌లోని ఈద్గాగా వద్ద జ్యూస్, రస్నాలను సామాజిక కార్యకర్త మెస్రం కేశవ్ పంపిణీ చేసి, వారికి రంజాన్ పండుగ శుభకాంక్షలు తెలిపారు.



ఆదిలాబాద్ రూరల్‌లో..



తాంసిలో..



నార్నూర్‌లో..



తలమడుగులో..



లక్ష్మణచాందలో..

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
కుమురంభీం ఆసిఫాబాద్
శుక్రవారం | ఏప్రిల్ 12, 2024 | www.navatelangana.com

డీసీసీ అధ్యక్షుడితో మాజీ ఎమ్మెల్సీ భేటి

నవతెలంగాణ-ఆసిఫాబాద్



ఇటీవల బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరిన ఉమ్మడి జిల్లా మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీష్ జిల్లా కేంద్రానికి వచ్చిన సందర్భంగా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు విశ్వప్రసాద్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పలు అంశాలు చర్చించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి గెలుపే తమ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ బాలేష్ గౌడ్, పార్టీ మండల అధ్యక్షుడు మసాడి చరణ్, నాయకులు దీపక్, అసద్ పాల్గొన్నారు.

మహాత్మ జ్యోతిబాపూలే 197వ జయంతి వేడుకలు

నవతెలంగాణ-రెబ్బెన

మండలంలోని గోలేటిలో బీసీ ఐక్య సంఘర్షణ సమితి ఆధ్వర్యంలో మహాత్మ జ్యోతిబా పూలే జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీసీ ఐక్య సంఘర్షణ సమితి అధ్యక్షుడు కేసరి ఆంజనేయులుగౌడ్ జ్యోతిబా పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. మహాత్మా జ్యోతిబా పూలే సేవలు మరువలేనివన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు కడతల మల్లయ్య, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగె ఉపేందర్, సాగర్‌గౌడ్, నాయకులు దొబ్బల శ్రీనివాస్, శంకర్, రాయమల్లు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ సభ్యత్వానికి రాజీనామా

రెబ్బెన : గత కొన్ని సంవత్సరాలుగా బీఆర్ఎస్ పార్టీకి సేవలందించిన రెబ్బెన మాజీ ఉపసర్పంచ్ మడ్డి శ్రీనివాస్ బీఆర్ఎస్ క్రియాశీలక సభ్యత్వానికి గురువారం రాజీనామ చేశారు. ప్రస్తుత రాజకీయాల దృష్ట్యా, తన రాజీనామ పత్రాన్ని ఎమ్మెల్యే కోవ లక్ష్మికి పంపించినట్టు తెలిపారు.

ఘనంగా పూలే దంపతుల విగ్రహాల ఆవిష్కరణ



నవతెలంగాణ-తాంసి

మహాత్మా జ్యోతిబా సావిత్రిబాయి పూలే విగ్రహాలు ఏర్పాటు చేసుకోవడం సంతోషించదగ్గ విషయమని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో మాజీ సర్పంచ్ స్వప్న రత్న ప్రకాష్ విగ్రహాల దాత సహకారంతో నెలకొల్పిన మహాత్మ జ్యోతిబా సావిత్రిబాయి పూలేల విగ్రహాలను ఆవిష్కరణకు ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. మాలీ యువజన సంఘం సభ్యులు కులస్థులు ఎమ్మెల్యేలను విగ్రహదాతను పూలమాల శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహనీయులను స్మరించుకుంటూ వారు చేసిన త్యాగాలు సేవలకు గుర్తింపుగా వారి విగ్రహాలను ఏర్పాటు చేసుకోవడం గొప్ప విషయమే అన్నారు. జ్యోతిబా సావిత్రిబాయి పూలే ఆదర్శ దంపతులుగా బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి ఎంతో కృషి చేశారని అన్నారు. నిరక్షరాస్యతను నిర్మూలించి, మహిళలకు అక్షరాస్యతపై అవగాహన కల్పిస్తూ, మహిళలు చదువుకునే విధంగా చేశారు. మొదటి ఉపాధ్యాయురాలుగా సావిత్రిబాయి మహిళలను చైతన్య పరిచారు. మాలీ కులస్తులకు ఒక గుర్తింపు తీసుకురావడం జరిగిందని అన్నారు. ఆవిష్కరణ కార్యక్రమానికి జిల్లాలోని మాలీ కుల సంఘ సభ్యులతో పాటు వివిధ కులాలకు చెందిన బీసీ కుల సంఘ నాయకులు, ప్రజలు పెద్ద ఎత్తున హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో మాలి యువజన సంఘం సభ్యులు ఉమేష్, ప్రవీణ్, అశోక్, ఇస్తారి, ఆశన్న, కులస్తులు గంగారాం, రమేష్, విఠల్, జై జెవాన్, పొచ్చన్న, బీసీ. కుల సంఘం సభ్యుల శ్రీనివాస్‌గౌడ్, మహేందర్‌రెడ్డి, రామన్న, నాయకులు గోవర్ధన్ రెడ్డి పాల్గొన్నారు.

జీపీ కార్మికుల జీతాలు అందేదెప్పుడు?

- ఐదు నెలలుగా అందని వేతనాలు
- వేతనాల కోసం ఎదురుచూపులు
- రాష్ట్ర ప్రభుత్వం జీతాలను విడుదల చేయాలి

నవతెలంగాణ - కౌటాల

గత ప్రభుత్వ హయాంలో తెలంగాణ రాష్ట్రంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో 500 జనాభాకు ఒక కార్మికుడి చొప్పున గ్రామ పంచాయతీల్లో కార్మికులను నియమించారు. అప్పటి ప్రభుత్వం మొదట ఒక్కరికి రూ.8 వేల వేతనం అందజేసింది. నిత్యవసర సరుకుల ధరలు పెరగడంతో చాలీచాలని వేతనంతో కార్మికులు వారి కుటుంబాలను పోషించడంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మరో రూ.500 పెంచింది. దానిని రెండోసారి రూ.9,500లకు పెంచి వారికి జీతాలు అందజేసింది. గత ప్రభుత్వంలో రెండు నెలల వేతనాలు పెండింగ్‌లో ఉండగా కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి మూడు నెలలు గడిచినప్పటికీ ఇప్పటికీ ఐదు నెలల వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయి. ఉదయం ఎనిమిది గంటల నుండి సాయంత్రం నాలుగు గంటల వరకు గ్రామాల్లో వీధివీధిన తిరిగి పారిశుద్ధ్య పనులు చేపట్టి నెల గడిస్తే జీతం వస్తుందనే ఆశతో పనిచేసినప్పటికీ ఐదు నెలలుగా ప్రభుత్వం వేతనాలు ఇవ్వకపోవడంతో అప్పులు చేసి కుటుంబాన్ని పోషించుకుంటున్నామని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికీ వేతనాలు రాక అప్పు ఇచ్చిన వారు ఇబ్బంది పెట్టడంతో ఏం చేయాలో దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్లాడుతున్నామని కార్మికులు వాపోతున్నారు. ఆరోగ్యం భాగాలేకున్న ఆస్పత్రికి వెళ్లాలంటే దళారీ



వడ్డీ వ్యాపారుల వద్ద అధిక వడ్డీలకు అప్పు తీసుకొని ప్రాణాలను బాగుచేసుకుంటున్నామని, జీతం ఎప్పుడత్తదోనని ఐదు నెలలుగా ఎదురుచూస్తున్నామని కార్మికులు పేర్కొంటున్నారు.

వచ్చిన జీతం వడ్డీకే పోతది

వెంకటి జీపీ కార్మికుడు



ఐదు నెలలుగా జీతాలు రకపోవడంతో వడ్డికి తెచ్చి నిత్యవసర సరుకులు, ఆరోగ్య ఖర్చులు, పిల్లల చదువుల కోసం అప్పులు చేశాము. ఈ వేతనం వస్తే అప్పు, అసలు అలాగే మిగిలి వచ్చే వేతనం వడ్డీలకే సరిపోతుంది. ప్రభుత్వం స్పందించి మా వేతనాలు విడుదల చేయాలని ప్రభుత్వాన్ని వేడుకుంటుంన్నాం. ఈ నెల గడిచిన తర్వాత జీతాలు రాకుంటే సమ్మె బాట పట్టకతప్పదని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

జీతం రాక అష్టకష్టాలు పడుతున్నాం

శంకర్ జీపీ కార్మికుడు



జీతం రాక అష్టకష్టాలు పడుతున్నామని, పొద్దంతా పనిచేసి ఇంటికెళ్తే నిత్యవసర సరుకుల కోసం ఇంటిలో గొడవలు అవుతున్నాయి. పప్పులు, నూనెలు, కూరగాయలు ఉద్దెర తీసుకొని ఐదు నెలలు గడిసే సరికి వ్యాపారస్తులు తీవ్ర ఇబ్బందులు పెట్టినా ఏం చేయలేకపోతున్నాము. ప్రభుత్వం స్పందించి మా జీతాలను వెంటనే విడుదల చేయాలి.

కత్తులతో దాడి కలకలం

- ఒకే గ్రూప్‌కు చెందిన యువకుల మధ్య ఘర్షణ
- ఇద్దరికి గాయాలు... రిమ్స్‌కు తరలింపు
- పరారీలో ముగ్గురు యువకులు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్





ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో రంజాన్ పండగ పూట ఒకే గ్రూప్‌కు చెందిన యువకుల మధ్య గురువారం కత్తులతో దాడి కలకలం రేపింది. వ్యాపారం చేస్తున్న కొందరు యువకులకు లావాదేవీల విషయంలో ఘర్షణ చోటుచేసుకుంది. మాటమాట పెరిగి కత్తులతో పొడుచుకునే వరకు దారితీసింది. కాగా పట్టణంలోని ఓల్డ్ బస్టాండ్ వద్ద పోలీస్ స్టేషన్ పక్కనే ఘటన జరగడం చర్చనీయాంశంగా మారింది. ఈ మేరకు వన్‌టౌన్ స్టేషన్ సీఐ సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని ఒకే గ్రూప్‌కు చెందిన ఇద్దరు యువకులపై అదే గ్రూప్‌కు చెందిన మరో ముగ్గురు యువకులు కత్తులతో దాడి చేశారు. రూ.40వేల లావాదేవీల విషయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఈ దాడిలో ముజాహిద్, షాహిద్‌లకు గాయాలయ్యాయి. వెంటనే వారిని స్థానికులు, పోలీసులు రిమ్స్‌కు తరలించారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఫజ్జుతో పాటు మరో ఇద్దరిపై కేసు నమోదు చేసినట్టు సీఐ తెలిపారు. ప్రస్తుతం దాడి చేసిన ఫజ్జు, మరో ఇద్దరు పరారీలో ఉన్నట్టు తెలిపారు. కాగా గాయపడిన యువకులను డీఎస్పీ జీవన్‌రెడ్డి రిమ్స్‌కు వెళ్లి వివరాలు అడిగి తెలుసుకున్నారు.

పటేల్ యూత్ గర్జనసభ విజయవంతం చేయాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఈ నెల 14న ఆదివారం కరీంనగర్‌లో నిర్వహించే మున్నూరుకాపు పటేల్ యూత్ గర్జన మహాసభ విజయవంతం చేయాలని తెలంగాణ మున్నూరు కాపు జర్నలిస్టు ఫోరం జిల్లా అధ్యక్షుడు అడప సతీష్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సభలో హైదరాబాద్‌లో 1000 మందితో బాల బాలిక వసతి గృహం ఏర్పాటు, కాపు కులస్తులను పటేల్ గెజిట్ కోసం తీర్మానం తీసుకోవడం జరుగుతుందని, ఈ సభకు మున్నూరు కాపులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

ఆదర్శప్రాయుడు మహాత్మ జ్యోతిబాపూలే

- మాలీ సంఘం జిల్లా అధ్యక్షుడు నాగోసే శంకర్
- ఘనంగా 197వ జయంతి వేడుకలు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

నేటి తరానికి మహాత్మ జ్యోతిబాపూలే ఆదర్శప్రాయుడని మాలి సంక్షేమ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు నాగోశే శంకర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని భాగ్యనగర్ ఎక్స్ రోడ్ వద్ద మాలి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన జయంతి వేడుకలకు అధ్యక్షత వహించగా జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు విశ్వప్రసాద్‌తో పాటు వివిధ సంఘాల నాయకులు హాజరయ్యారు. సందర్భంగా వారు మాట్లాడుతూ దళిత బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి మహాత్మ జ్యోతిబాపూలే అని కొనియాడారు. మనువాదుల నిరంకుశత్వాన్ని ప్రశ్నించిన గొప్ప వీరుడని అన్నారు. దళిత బహుజన మహిళలకు విద్య నేర్పించాడన్నారు. అన్ని వర్గాలు విద్యా ఉద్యోగాల్లో సమాన వాటా కలిగి ఉండాలని పోరాటం చేసిన గొప్ప వ్యక్తి పూలే అన్నారు. అనగారిన వర్గాల కోసం పోరాటం చేసిన ఆయన నేటి తరానికి ఆదర్శప్రాయుడని కొనియాడారు. అనంతరం సాలెగూడ గ్రామంలో పూలే భవన నిర్మాణ ప్రాంగణంలో ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ ఎంఎస్పి జాతీయ నాయకులు రేగుంట కేశవ్ రామ్, మాలి సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకులు నికుడే రవీందర్, అంబేద్కర్ సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు దుర్గం తిరుపతి, అదే బాబురావు, మాజీ ఎంపీపీ బాలేష్‌గౌడ్, మాలి సంక్షేమ సంఘం మండల అధ్యక్షులు పెరుగు ఆత్మరావ్, నారాయణ, మోహూర్లే విశ్వనాథ్ సండే సోమయ్య, వాడై గౌరయ్య, చాపిడి సురేష్, ముకుందరావు పాల్గొన్నారు.

ప్రజా సంఘాల ఆధ్వర్యంలో

మహాత్మ జ్యోతిబాపూలే జయంతి వేడుకలను జిల్లా కేంద్రంలోని సీపీఐ(ఎం) జిల్లా కార్యాలయంలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి దుర్గం దినకర్, టీఏజీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గెడం టీకనంద్, గొడిసెల కార్తీక్, జిల్లా ఉపాధ్యక్షులు చాపిడి పురుషోత్తం, జిల్లా సహాయ కార్యదర్శి ఆత్మకూరి సతీష్, వడ్లూరి శ్రీకాంత్ పాల్గొన్నారు.

బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో

బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో అంబేద్కర్ చౌక్ వద్ద పూలే జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు రూప్నర్ రమేష్, ఉపాధ్యక్షుడు పురుషోత్తం బాలేష్, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు వైరాగడి మారుతి పటేల్ పాల్గొన్నారు.

జై భీమ్ సేన ఆధ్వర్యంలో

జై భీమ్ సేన ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని బస్టాండ్ ముందు నిర్వహించిన వేడుకల్లో అధ్యక్షుడు వినోద్ జాడే, లుంబిని దీక్ష భూమి అధ్యక్షుడు మనోహర్, సెంటర్ కమిటీ ప్రధాన కార్యదర్శి దుర్గం సుధాకర్, కృష్ణాజీ, అన్నారావు, అనిల్, జాడే అశోక్, జాడే హేమంత్ షిండే, దీపక్, ప్రమోద్, ప్రకాష్, రవిదాస్, ప్రవీణ్, బాపూరావు, చైతన్య, ఊశన్న పాల్గొన్నారు.

వాంకిడి : మండలకేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో గురువారం మహాత్మా జ్యోతిబాపూలే 197వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. అంతకుముందు పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా మాలీ సంఘం మండల అధ్యక్షుడు వడాయి బాపురావు మాట్లాడుతూ మహాత్మా జ్యోతిబాపులే ఆశయాలను కొనసాగించాలని, ఆయన అడుగుజాడల్లో నడవాలని అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు గుర్నులే నారాయణ, డివిజన్ అధ్యక్షుడు గుర్నులే మెంగాజీ, అశోక్, సెండె వాసు, బెండారి కృష్ణ, సుధాకర్, గౌరవయ్య, వివిధ గ్రామాలకు చెందిన పటేళ్లు పాల్గొన్నారు.

కెరమెరి : మహాత్మా జ్యోతిబాపూలే జీవితం ఆదర్శనీయమని జడ్పీటీసీ సెడ్మకి ద్రుపత బాయి, వైస్ ఎంపీపీ అబుల్ కలాం, మాలీ సంఘం అధ్యక్షుడు కావుడే తులసిరాం అన్నారు. భారతీయ సంఘ సంస్కర్త మహాత్మా జ్యోతిబాపూలే జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. పూలే దంపతులు విగ్రహాలకు పూల మాలలు వేసి ఘనంగా నివాళ అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కులవ్యవస్థకు వ్యతిరేకంగా సత్యశోధక్ సమాజ్ స్థాపించి, తన భార్య సావిత్రీ బాయి పూలేతో ఎన్నో పాఠశాలలు ఏర్పాటు చేసి విద్యార్థులకు విద్యాభ్యాసం చేసి ఉన్నత శిఖరాలను అధిరోహించిన మహనీయులు పూలే దంపతులని కొనియాడారు.



ఆసిఫాబాద్ : ప్రజా సంఘాల ఆధ్వర్యంలో పూలే జయంతి వేడుకలు

కాగజ్‌నగర్ రూరల్ : మండలంలోని కోసిని గ్రామంలోని పూలె విగ్రహానికి పలు సంఘాల ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్, పీఆర్టీయూటీఎస్ జిల్లా అధ్యక్షుడు ఏటుకూరి శ్రీనివాసరావు, మండల అధ్యక్ష కార్యదర్శులు ఎనగంటి భిక్షపతి, పత్తిపాక శ్రావణ్, విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు ఎం.జయదేవ అబ్రహం, కార్యదర్శి శివప్రసాద్, బావండ్లపల్లి నర్సయ్య, ఎం. సుభాష్, పురుషోత్తం, అల్లి రాజయ్య, ఓదేలు, నాగేశ్వరరావు, రాజనర్సు, మోర్లె బాబురావు పాల్గొన్నారు.

బెజ్జూరు : మహాత్మా జ్యోతిబాపూలే ఆశయాలను కొనసాగించే విధంగా ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఎమ్మెల్సీ దండె విట్టల్ అన్నారు. జ్యోతిబాపూలే జయంతి సందర్భంగా గురువారం మండలకేంద్రంలోని జ్యోతిబాపులే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల కోసం జ్యోతిబాపులే చేసిన సేవలు మరిచిపోలేనివని, మహనీయుడి ఆశయసాధన కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ఆదె శెమీయొద్దీన్, సామల రాజన్న, ఉమామహేష్, చిప్పకుర్తి దేవాజీ, స్రావన్, రాజేష్ పాల్గొన్నారు.

కౌటాల : మహాత్మా జ్యోతిబాపులే అడుగుజాడల్లో నడవాలని మాలీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆదె వసంత్‌రావు అన్నారు. మహాత్మా జ్యోతిబాపులే 197వ జయంతి సందర్భంగా మండలకేంద్రంలోని బస్టాండు సమీపంలో గల పూలే విగ్రహానికి పూలమాలలు వేసి, కేక్ కట్ చేసి జయంతి వేడుకలను జరుపుకున్నారు. మహాత్మా జ్యోతిబాపూలే, సావిత్రీబాయి పూలే జయంతి, వర్ధంతులను రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించి ఆ రోజున సెలవు ప్రకటించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమానికి వివిధ గ్రామాల నుంచి మాలీ సంక్షేమ సంఘం నాయకులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. కార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షుడు నికోడె గంగారాం, ఆదె నాందేవ్, సెండె నాందేవ్, ఆదె బాపురావు, వడాయి ప్రసాద్, వడాయి వెంకటి, లెండుగురె శంకర్, ఆదె శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆదిలాబాద్‌టౌన్ : జ్యోతిబాపూలే గొప్ప సంఘ సంస్కర్త అని బీసీ సంక్షేమ శాఖ అధికారి రాజలింగు అన్నారు. మహాత్మ జ్యోతి బాపూలే జయంతిని గురువారం అధికారికంగా నిర్వహించారు. ఎస్సీ కార్పొరేషన్ ఆవరణలోని పూలే దంపతుల విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బీసీ సంక్షేమ శాఖ అధికారి రాజలింగు మాట్లాడుతూ మూఢ నమ్మకాలు పెరుగుతున్న కాలంలో బడుగు బలహీన వర్గాలను చైతన్యవంతులను చేసిన మహనీయుడు పూలే అని కొనియాడారు. ఎన్నికల కోడ్ కారణంగా అధికారిక వేడుకలకు ఎవరినీ ఆహ్వానించలేదన్నారు. పూలే ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో మాలీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుకుమార్ పేట్కులే, ఆయా సంఘాల నాయకులు రాజన్న, భూమన్న, ఊశన్న, సుదర్శన్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ఆధ్వర్యంలో..

బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పూలే జయంతి వేడుకలను నిర్వహించారు. బీసీ స్టడీసర్కిల్ ఆవరణలోని జ్యోతి బాపూలే విగ్రహానికి బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న, ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కుతో కలిసి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు రాజన్న, నర్సింగ్‌రావ్, నారాయణ, రాము, రఫీక్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో..

కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మహాత్మ జ్యోతిబాపూలే జయంతిని నిర్వహించారు. పట్టణంలోని బీసీ స్టడీ సర్కిల్ కార్యాలయ ఆవరణలోని పూలే విగ్రహానికి అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాస్‌రెడ్డి పార్టీ నాయకులతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ చైర్మెన్ అడ్డి భోజారెడ్డి, నాయకులు దామోదర్‌రెడ్డి, దుర్గం శేఖర్, రాజేశ్వర్, బిక్కి గంగాధర్ పాల్గొన్నారు

పూలే వర్ధంతినీ అధికారికంగా నిర్వహించాలి

సమ సమాజ స్థాపనకు కృషి చేసిన మహాత్మా జ్యోతిబాపూలే వర్ధంతిని కూడా అధికారికంగా నిర్వహించాలని అఖిల భారతీయ మాలీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుకుమార్ పెట్కూలే అన్నారు. గురువారం అఖిల భారతీయ మాలీ సంఘం ఆధ్వర్యంలో జ్యోతిబాపూలే జయంతిని నిర్వహించారు. ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయ ఆవరణలోని పూలే దంపతుల విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళు లర్పించారు.

బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో..

బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మహాత్మ జ్యోతిబాపూలే జయంతిని నిర్వహించారు. సంఘ భవనంలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చిక్కాల దత్తు, కలల శ్రీనివాస్ పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. కార్యక్రమంలో బీసీ సంఘం నాయకులు జక్కుల శ్రీనివాస్, సత్యనారాయణ, దోడ అశోక్, దాముక రవీందర్, ఉమ, గంగామణి, నర్సిములు, కాసర్ల శ్రీనివాస్, రమేష్ బాబు, నవీన్ యాదవ్ పాల్గొన్నారు.

బోథ్ : మహాత్మ జ్యోతిరావు పూలే జయంతిని బస్టాండ్ ఆవరణలో బీఆర్ఎస్ నాయకుల ఆధ్వర్యంలో నిర్వహించారు. చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలోఆత్మ చైర్మన్ మల్లెపూల సుభాష్, గ్రంథాలయ డైరెక్టర్ రమణగౌడ్, పార్టీ యూత్ ప్రెసిడెంట్ ప్రవీణ్, బీసీ ప్రెసిడెంట్ రమణ, సొసైటీ డైరెక్టర్ నారాయణ పాల్గొన్నారు.

ఘనంగా రంజాన్ వేడుకలు

- ఈద్గా మసీదులో ప్రత్యేక ప్రార్థనలు
- పోలీసుల పటిష్ట భద్రత

నవతెలంగాణ-ఆసిఫాబాద్

రంజాన్ పర్వదినాన్ని ముస్లిం సోదరులు గురువారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా ఉన్న మసీదులు, ఈద్గాల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పవిత్ర రంజాన్ మాసంలో భక్తి శ్రద్ధలతో ఉపవాస దీక్షలు ముగించిన వేళ ఈదుల్ ఫితర్ జరపడం ఆనవాయితీ, రంజాన్ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనల నేపథ్యంలో పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. ఇందులో భాగంగా జిల్లా కేంద్రంలోని బాబాపూర్ రహదారికి వెళ్లే ఈద్గా వద్ద ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించగా ప్రముఖులు పాల్గొన్నారు. అనంతరం ఒకరికొకరు ఆలింగనం చేసుకుంటూ పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీపీ మల్లికార్జున్ వేడుకల్లో పాల్గొన్న ప్రతి ఒక్కరికి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రంజాన్ వేడుకలు మతసామరస్యాన్ని, ఆత్మీయతను చాటుతాయన్నారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ అలీ బిన్ అహ్మద్, టీయూడబ్ల్యూజే ఐజేయు జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ రెహమాన్, వైస్ ఎంపీపీ సుంకరమంగా పెంటయ్య, టిఆర్ఎస్ నాయకులు రవీందర్, బాబురావు, భీమేశ్, అబ్దుల్లా, సలాం, నిసార్, వెంకన్న, మల్లేష్ పాల్గొన్నారు.

పోలీసులు పటిష్ట బందోబస్తు

రంజాన్ పండుగను పురస్కరించుకొని డీఎస్పీ సదయ్య ఆధ్వర్యంలో పోలీసులు పటిష్ట బందోబస్తు నిర్వహించారు. పట్టణ సీఐ సతీష్ ఎస్ఐలు ప్రవీణ్, మహేందర్, రాజేశ్వర్, కానిస్టేబుల్ బందోబస్తులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మైనారిటీ సోదరులకు పోలీసులు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.

వాంకిడి : మండలకేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో గురువారం రంజాన్ పండుగను భక్తిశ్రద్ధలతో ఈదుల్ ఫితర్‌ను ముస్లింలు ఘనంగా నిర్వహించుకున్నారు. నెల రోజుల పాటు ఉపవాస దీక్షలు చేపట్టిన ముస్లింలు బుధవారం నెలవంక



దర్శనమివ్వడంతో ఉపవాస దీక్షలు విరమించుకున్నారు. ఈద్గాలో మత గురువు మహ్మద్ ప్రవక్త దర్శనాన్ని చూపించారు. అనంతరం ముస్లింలు ఒకరికొకరు ఆలింగనం చేసుకొని ఈద్‌ముబారక్ తెలుపుకున్నారు.

బెజ్జూరు : మండలంలో రంజాన్ పండుగను ముస్లింలు గురువారం ఘనంగా నిర్వహించుకున్నారు. కుకుడ, మర్తిడి, ఎలుకపెల్లి, బెజ్జూరు గ్రామాల్లో ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ఒకరికొకరు ఆలింగనం చేసుకుంటూ రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు.

సిర్పూర్(టి) : రంజాన్ పవిత్రమాసాన్ని పురస్కరించుకొని ఈద్గా వద్ద భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు చేశారు. అనంతరం చిన్నా, పెద్దా తేడా లేకుండా ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈద్గా వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా సిర్పూర్ ఎస్ఐ దీకొండ రమేష్ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటుచేశారు.

దహెగాం : మండలకేంద్రంతో పాటు మండలంలోని బీబ్రా, ఒడ్డుగూడ, మొట్లగూడ, గొర్రెగుట్ట తదితర గ్రామాల్లో ముస్లిం సోదరులు ఘనంగా ఇదుల్ ఫితర్(రంజాన్) నిర్వహించుకున్నారు. ఉదయాన్నే ఆయా ఈద్గాలు, మసీదుల వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి ఒకరికొకరు ఈద్‌ముబారక్ చెప్పుకున్నారు. 30 రోజుల ఉపవాస దీక్ష అనంతరం నిర్వహించే పండుగను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించుకున్నారు.

ఘనంగా జ్యోతి బాపూలే జయంతి వేడుకలు



నవతెలంగాణ-కాగజ్‌నగర్

కాగజ్‌నగర్ పట్టణంలో గురువారం మహాత్మా జ్యోతి బాపూలే 198వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ప్రజాసంఘాల ఆధ్వర్యంలో స్థానిక కార్యాలయంలో జ్యోతి బాపూలే చిత్రపటం వద్ద నివాళులు అర్పించారు. దీనికి హాజరైన సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి కూశన రాజన్న మాట్లాడుతూ పూలే గొప్ప సామాజిక వేత్తగానే కాకుండా సంఘ సంస్కర్త, బడుగు బలహీనవర్గాల ఆశాజ్యోతి అని కొనియాడారు. దేశంలో అంటరానితనం, కులవ్యవస్థ నిర్మూలనతో పాటు మహిళోద్ధరణకు కృషి చేసిన మహనీయుడని అన్నారు. సీపీఐ(ఎం) డివిజన్ కార్యదర్శి ముంజం ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ పూలే స్ఫూర్తితో నేడు బీజేపీని ఓడించాలని అన్నారు. బీజేపీ పదేళ్ల కాలంలో కుల, మత రాజకీయాలు చేస్తూ దేశాన్ని వెనక్కి నెట్టేస్తోందని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు చాపిలె సాయికృష్ణ, దుర్గం అనిత, నగరం పద్మ, నితీష్, యు రవి, సురేఖ పాల్గొన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో...

భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో జ్యోతబాపూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. కోసిని పంచాయతీ పరిధిలోని డాడానగర్ చౌరస్తా వద్ద ఉన్న జ్యోతిబాపూలే దంపతుల విగ్రహాలకు పార్టీ జిల్లా అధ్యక్షులు డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పూలే దంపతులు దేశంలో స్త్రీ విద్యకు మార్గదర్శకులు అని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పటేల్ వసాకె హన్మంతు, మాలి సంఘం అధ్యక్షులు మోర్లె బాబూరావు, మాజీ పటేల్ పాండు, నాయకులు పాల్గొన్నారు. స్థానిక బీజేపీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే పాల్వాయి రాజ్యలక్ష్మి ఆధ్వర్యంలో జ్యోతిబాపూలే జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పూలే చిత్రపటానికి పూలమాలలు వేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు గజ్జి ప్రసాద్, కొండ తిరుపతి, చేరాల శ్రీనివాస్, చిప్పకుర్తి శ్రీనివాస్, జాడి దీపక్ పాల్గొన్నారు. అదేవిధంగా స్థానిక మహాత్మా జ్యోతిబాపూలే బాలుర పాఠశాలలో జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, డ్రాయింగ్, ఉపన్యాస పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ మంగ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అదేవిధంగా సమతా సొసైటీ ఆధ్వర్యంలో జ్యోతిబాపూలే జయంతి వేడుకలను నిర్వహించారు. సాంఘీక రుగ్మతలను, మూఢాచారాలను, కులవ్యవస్థను నిబద్ధతతో వ్యతిరేకించి, బహుజన జీవితాలలో వెలుగులు నింపిన పూలే ఆదర్శనీయుడని పలువురు కొనియాడారు. ఈ కార్యక్రమంలో సొసైటీ సభ్యులు దుర్గం జనార్దన్, జాడి సుఖదేవ్, ముడిమడుగుల తిరుపతి, దుర్గం విస్తారు. దుర్గం రాంచందర్, దుర్గం మోహన్, డొంగ్రె గజానన్, సునీల్ పాల్గొన్నారు. సీనియర్ సిటిజన్స్ అసోషియేషన్ ఆధ్వర్యంలో స్థానిక డాడానగర్ చౌరస్తాలో ఉన్న పూలే విగ్రహం వద్ద జయంతిని ఘనంగా నిర్వహించారు. పూలే దంపతుల విగ్రహాలకు పూలమాలలు వేశారు. ఈ కార్యక్రమంలో అసోషియేషన్ రాష్ట్ర కార్యదర్శి మార్త సత్యనారాయణ, నాయకులు కలికోట రమణయ్య, ఎల్లాగౌడ్, పుర్క సీతారాం, పి దేవయ్య, జి నాగేశ్వర్‌రావు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మంచిర్యాల
శుక్రవారం | ఏప్రిల్ 12, 2024 | www.navatelangana.com

మనస్తాపంతో విద్యార్థిని ఆత్మహత్య



నవతెలంగాణ-జైపూర్

మండంలోని వేలాల గ్రామానికి చెందిన ప్యాగ షాయిశ్మ (19) సెల్ ఫోన్ విషయమై మనస్థాపం చెంది ఆత్మహత్యకు పాల్పడింది. సెల్ ఫోన్ డిస్ ప్లే పగిలిన విషయమై కుటుంబ సభ్యుల మధ్య జరిగిన చిన్న ఘర్షణతో మనస్థాపం చెందిన ఆమె గురువారం ఇంట్లో ఎవరు లేనపుడు ఉరివేసుకున్నట్లు గ్రామస్తులు తెలిపారు. ప్యాగ స్వామి సారక్కల కూతురు షాయిష్మ ప్రయివేటు కళాశాలలో డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతున్నట్లు గ్రామస్తులు తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు జైపూర్ పోలీసులు కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

నీటి సమస్య తలెత్తితే సంప్రదించాలి

నవతెలంగాణ-నస్పూర్



వేసవికాలం నేపథ్యంలో మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలు నీటి సమస్య తలెత్తితే సంప్రదించాలని మున్సిపల్ కమిషనర్ సతీష్ అన్నారు. గురువారం మున్సిపాలిటీ పరిధిలోని 10, 19 వార్డులో పర్యటించి నీటి ఇబ్బందులపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఎక్కడ లీకేజీలు లేకుండా ఎప్పటికప్పుడు మరమ్మత్తులు చేపట్టాలని, నీరు అత్యవసరం ఉన్నచోట ప్రజలకు వాటర్ ట్యాంకుల ద్వారా నీటిని సరఫరా చేస్తామన్నారు. తాగునీటి సమస్యల ఉన్న వెంటనే పురపాలక సంఘం, నస్పూర్ మున్సిపల్ కంట్రోల్ రూమ్ 9959283814, 9533459712, 9550357732, 7799821299, 9553331187 నెంబర్లను సంప్రదించాలన్నారు.

జ్యోతిబాపూలే ఆశయ సాధనకు కృషి చేద్దాం

నవతెలంగాణ-జైపూర్

ప్రజలందరు విజ్ఞానవంతులు కావలన్న ధృడ సంకల్పంతో మహిళలు సైతం విద్యావంతులు కావాలని ఆకాంక్షించిన జ్యోతిబాపూలే ఆశయ సాధనకు కృషి చేయాలని శివ్వారం గ్రామ పంచాయతీ తాజా మాజీ సర్పంచ్ ఆవిడపు గణేష్, ప్రజా సంఘాల నాయకుడు బోడంకి చందు అన్నారు. జ్యోతిబాపూలే జయంతిని పురస్కరించుకుని గురువారం గ్రామస్థులతో కలిసి పూలే చిత్ర పటానికి పూల మాల వేసి నివాళ్లు అర్పించారు. కోటపల్లి మండలం లక్ష్మీపూర్ గ్రామంలో పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లు అర్పించారు.

సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో

చెన్నూర్ మండలం అంగరాజుపల్లిలో మహత్మ జ్యోతిబాపూలే జయంతి వేడుకలు సీపీఎం ఆధ్వర్యంలో గురువారం ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమంలో పాల్గొన్న సీపీఎం జిల్లా కార్యదర్శి సంకె రవి మాట్లాడుతూ నిమ్న కులాల అభివృద్ధికి మహనీయులు చేసిన త్యాగం మరువలేమని అన్నారు. వారి ఆశయాలను కొనసాగించుటకై భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవల్సిన అవసరమని పేర్కొన్నారు. మనుస్మృతిని అమలు చేస్తున్న బీజేపీని వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో ఓడించినప్పుడే మహనీయులకు మనమిచ్చే ఘనమైన నివాళి అని అన్నారు. కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కమిటి సభ్యులు బోడంకి చందు, సీపీఎం నాయకులు రాతిపల్లి నాగేష్, సీఐటీయూ నాయకులు కరీంబీ, సీపీఎం నాయకురాలు సంకె రాజకుమారి, గ్రామస్థులు పాల్గొన్నారు. చెన్నూర్ మండలం బావురావుపేట్ గ్రామంలో ఆదివాసి నాయకురాలు సిడం సమ్మక్క పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. ఈ కార్యక్రమంలో సిడం సధ్య, మౌనిక, గట్టు అరుణ, స్వప్న, అజయ్, ఆలం లక్ష్మీ, కోర్తె కావేరి తదితరులు ఉన్నారు.

ఐద్వా ఆధ్వర్యంలో పూలే జయంతి

చెన్నూర్ మండల కేంద్రంలో గల కోటబొడలో గురువారం ఐద్వా ఆధ్వర్యంలో జ్యోతిబాపూలే జయంతి వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. మహిళలకు చదువుకునే హక్కు ఉండాలని పోరాడిన పూలే స్పూర్తితో గత 10 సంవత్సరాలుగా అధికారంలో ఉండి కూడా మహిళల, ఆడ పిల్లలపై జరుగుతున్న దుర్మార్గలను అరికట్టలేని ఆర్ఎస్ఎస్, బీజేపీలకు మహిళా లోకం రాబోయే ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బోగె నాగజ్యోతి, కుందారపు లక్ష్మి, బండ అనసూర్య, ముస్కె రమ, మీనుగు దుర్గమ్మ, లావణ్య, రజిత పూరేళ్ల సడవలి, బోగె సత్తన్న పాల్గొన్నారు.



జైపూర్ : సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో నివాళ్లు అర్పిస్తున్న నాయకులు

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో

రామకృష్ణాపూర్ : ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో మంచిర్యాలలోని బీసీ, ఎస్టీ హాస్టల్‌లో గురువారం దేశ తొలి సామాజిక విప్లవకారుడు మహాత్మజోత్యిబాపూలే జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంచిర్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి ఈదునూరి అభినవ్ మాట్లాడుతూ కుల వ్యవస్థ నిర్మూలన, మహిళలు అణగారిన కులాల ప్రజలకు విద్యను అందించడంలో ఆయన చేసిన కృషిని కొనియాడారు. బాల్య వివాహాలను వ్యతిరేకించి వితంతు పునర్వివాహాలను ప్రోత్సాహించారని, దేశంలో లింగ వివక్ష, కుల వివక్షపై, అంటరానితనం, సామాజిక అసమానతలపై పంతొమ్మిదో శతాబ్దంలో ఆయన చేసిన పోరాటం తర్వాతి కాలంలో అంబేద్కర్ లాంటి వారికి స్పూర్తిగా నిలిచిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మంచిర్యాల జిల్లా కమిటీ సభ్యులు బండి సత్యనారాయణ, అరవింద్‌రెడ్డి పాల్గొన్నారు.

కాసిపేట : కాసిపేట మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో మహాత్మా జ్యోతిబాపూలే జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు జాడి పోశం, సాంస్కృతిక ఇన్‌చార్జి గొడిశెల బాపు, సలహాదారులు మద్దినేని చిన్న భీమయ్య, దాగం మల్లేశ్, పల్లె మల్లయ్య, కార్యదర్శి గొడిశెల సురేందర్, సహాయ కార్యదర్శి అగ్గి వెంకటస్వామి, లంక లక్ష్మణ్, రాంటెంకి వాల్దేవ్, పెద్దపల్లి శంకర్, కలవల శ్రీనివాస్, సిరాజాన్ గొడిశెల క్రాంతి పాల్గొన్నారు.

సోమగూడెంలో పూలే జయంతి

సోమగూడెం శిశు మందిర్ క్రీడా మైదానంలో వాకర్స్, క్రీడాకారులు ఆధ్వర్యంలో మహాత్మా జ్యోతిబాపూలే జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ కార్యక్రమంలో సంకె రవి, సిద్దయ్య, శ్రీనివాస్, రమేశ్, పోశం, బానేశ్, వెంకన్న, కిరణ్, రాంచందర్ పాల్గొన్నారు.

మందమర్రి : జ్యోతిబాపూలే జయంతి వేడుకలను పట్టణ బీసీ సంక్షేమ సంఘం నాయకులు ఘనంగా నిర్వహించారు. గురువారం బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సింగరేణి ఉన్నత పాఠశాల మైదానం అంబేద్కర్ విగ్రహం వద్ద మహాత్మ జ్యోతిబాపూలే 198వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పట్టణ అధ్యక్షుడు శ్రీనివాస్, వర్కింగ్ ప్రెసిడెంట్ శంకర్, ప్రధాన కార్యదర్శి రవిరాజ లు జ్యోతిబా పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించి, కేక్ కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేశారు. సంఘం నాయకులు క్రాంతి కుమార్, సాగర్ బాబు, ప్రభాకర్, వేణుగోపాల్, సంపత్ పాల్గొన్నారు.

జన్నారం : మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద మహాత్మా జ్యోతిబాపూలే జయంతి వేడుకలను గురువారం అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో, ఘనంగా నిర్వహించారు. ముందుగా పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ సంఘం మండల అధ్యక్షుడు సిటీ మల్ల భరత్ కుమార్, బీసీ కులాల ఉద్యమ పోరాట సంఘం కరీంనగర్ జోన్ కన్వీనర్ కేప నరసింహులు, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కన్వీనర్ కోడూరు చంద్రయ్య, కోకన్వీనర్ శ్రీరాముల గంగాధర్, మున్నూరు కాపు సంఘం సీనియర్ నాయకుడు గోపి సత్యనారాయణ పాల్గొన్నారు

రామకృష్ణాపూర్ : మహాత్మా జ్యోతి బాపూలే 197వ జయంతిని పట్టణంలోని స్థానిక రాజీవ్ చౌక్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యమానికి చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకట స్వామి పాల్గొని ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు పల్లె రాజు, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పిన్నంటి రఘునాథ్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గోపతి రాజయ్య, అధికార ప్రతినిది ఒడ్నాల శ్రీనివాస్, సీనియర్ నాయకులు మహంకాళి శ్రీనివాస్, నీలం శ్రీనివాస్‌గౌడ్, కాంగ్రెస్ నాయకులు దళిత బహుజన ఐక్య వేదిక జిల్లా కో ఆర్డినేటర్ పలిగిరి కనకరాజు పాల్గొన్నారు.

నస్పూర్: పట్టణంలో మహత్మ జ్యోతిబాపూలే జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్ కుమార్, టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గుర్రాల రాజావేణు, ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈదూనూరి అభినవ్ ఆధ్వర్యంలో బీసీ, ఎస్టీ బాయ్స్ హాస్టల్‌లో, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి డోర్కె మోహన్ ఆధ్వర్యంలో జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.



నస్పూర్‌లో..



కాసిపేటలో..



రామకృష్ణాపూర్ : ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నివాళ్లు అర్పిస్తున్న విద్యార్థులు



జన్నారంలో..



మందమర్రిలో..

బుద్దిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా సమావేశం



నవతెలంగాణ-కాసిపేట

మండలంలోని దేవాపూర్ అంబేద్కర్ భవన్‌లో బుద్దిస్ట్ సొసైటీ సమావేశాన్ని గురువారం జిల్లా సలహాదారుడు పల్లె మల్లయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి బుద్దిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా మంచిర్యాల శాఖ అధ్యక్షుడు యుగంధర్ ముఖ్య అతిధులుగా హాజరయ్యారు. సమావేశం అనంతరం మండల బుద్దిస్ట్ సొసైటీ ఇండియా తాత్కాలిక కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా బ్రహ్మయ్య, ఉపాధ్యాక్షులుగా చిప్పకుర్తి బాపు, ప్రధాన కార్యదర్శిగా రాజు పాలేకర్, ప్రచార కార్యదర్శిగా కొమ్ముల బాపు, మహిళా అధ్యక్షురాలిగా రజనీ పాలేకర్, ప్రధాన కార్యదర్శిగా ముడిమగుడుల తిరుపతిలను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సలహాదారుడు తోటపల్లి భూమన్న, ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు ముల్కల్ల ప్రశాంత్, అటకపురం రమేశ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

కడుపునొప్పి భరించలేక మహిళ ఆత్మహత్య

నవతెలంగాణ-జన్నారం

కడుపునొప్పి భరించలేక మహిళా పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని మురిమడుగు గ్రామంలో చోటుచేసుకుంది. మృతురాలి కుటుంబ సభ్యులు స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గద్దల నవ్య(28) ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ ఆర్డీఓ కార్యాలయంలో గత కొంతకాలంగా అటెండర్‌గా విధులు నిర్వహిస్తోంది. ఆమె గత కొంతకాలంగా కడుపునొప్పితో బాధపడుతోంది. బుధవారం కడుపునొప్పి ఎక్కువ కావడంతో నొప్పి భరించలేక నవ్య పురుగుల మందు తాగింది. ఆమె భర్త శ్రీనివాస్ స్థానికులు హుటాహుటిన మంచిర్యాలలోని ప్రయివేటు ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ గురువారం మృతి చెందినట్లు వారు తెలిపారు. మృతురాలు నవ్యాకు కొడుకు, కూతురు ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు అదనపు ఎస్సై సర్కార్ తెలిపారు.

జార్జిరెడ్డి జీవిత చరిత్ర పాఠ్యపుస్తకాల్లో చేర్చాలి



నవతెలంగాణ-నస్పూర్

జార్జిరెడ్డి జీవిత చరిత్ర పాఠ్య పుస్తకాల్లో చేర్చాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీకాంత్ అన్నారు. ఉస్మానియా యూనివర్సిటీ గోల్డ్ మెడల్ రేఖ జార్జిరెడ్డి 52వ వర్ధంతి సందర్భంగా జిల్లా కేంద్రంలోని ఇంటిగ్రేటెడ్ హాస్టల్‌లో గురువారం జార్జిరెడ్డి చిత్రపటానికి పూలమాలవేసి నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హైదరాబాద్ ఉస్మానియా యూనివర్సిటీలో 1972లో పీడీఎస్‌యూ విద్యార్థి సంఘాన్ని స్థాపించి యూనివర్సిటీలో శాస్త్రీయమైన విద్య కోసం సమసమాజ స్థాపనకు, విద్యార్థుల హక్కుల కోసం భూమి, భుక్తి, విముక్తి కై ప్రజా పోరాటాలు చేస్తూ విద్యార్థులపై జరుగుతున్న అన్యాలను, అక్రమాలకు ఎదిరించి అనేక ఉద్యమాలు చేసి ఉద్యమకారుడని కొనియాడారు. ఆర్ఎస్ఎస్, బీజేపీ మతోన్మాదులు గుండాల చేతిలో హతమై 52 సంవత్సరాలు గడిచిన సందర్భంగా పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో వారోత్సవాలు నిర్వహించుకుంటున్నట్లు తెలిపారు. జార్జిరెడ్డి స్ఫూర్తితో ఉద్యమాలు నిర్వహించాలని పీడీఎస్‌యూ విద్యార్థి సంఘంగా విద్యార్థులకు, యువకులకు పిలుపునిచ్చారు. అలాగే విద్యారంగాన్ని కాషాయీకరించే కుట్రలో భాగంగా తీసుకువచ్చిన నూతన జాతీయ విద్యా విధానం 2020ను రద్దు చేయాలని, జార్జిరెడ్డి ఉద్యమస్ఫూర్తితో మతోన్మాద ఫాసిస్టు విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాజేష్, తిరుపతి, శీను, ఆకాష్, వేణు పాల్గొన్నారు.

కాకా కుటుంబాన్ని విమర్శించే నైతిక హక్కు లేదు

నవతెలంగాణ-మందమర్రి



కాకా కుటుంబాన్ని విమర్శించే నైతిక హక్కు బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఎర్రబెల్లి రఘునాథరావుకు లేదని, వెంటనే క్షమాపణ చెప్పాలని కాంగ్రెస్ సీనియర్ నాయకులు సోతుకు సుదర్శన్ డిమాండ్ చేసారు. కాంగ్రెస్ బీ1 కార్యాలయం వద్ద బుధవారం రాత్రి నిర్వహించిన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ నాయకులు సోతుకు సుదర్శన్ మాట్లాడుతూ కాకా వెంకటస్వామి కుటుంబం 70 సంవత్సరాల నుండి అనేక సేవలు చేస్తున్నప్పుడు ఈ ప్రాంతంలో లేడని అన్నారు. ఏడు సంవత్సరాల క్రితం మంచిర్యాలకు వచ్చి అవగాహన లేకుండా మాట్లాడటం సరికాదన్నారు. కాకా కుటుంబం పెద్దపల్లి పార్లమెంటులోని-7 అసెంబ్లీ నియోజకవర్గాలలో 10,000 బోర్లు వేసారన్నారు. చెక్ డ్యాములు కట్టించడం, ప్రభుత్వ పాఠశాలలలో చదువుకునే విద్యార్థుల కోసం అదనపు గదులు కట్టించి, వారు కూర్చోవడానికి బెంచీలు సమకూర్చారని తెలిపారు. కుట్టు మిషన్ శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేసి ఇంటికి ఒక మిషన్ చొప్పున దాదాపు 2500 కుట్టు మిషన్‌లను బీద మహిళలకు ఇవ్వడం జరిగిందన్నారు. మందమర్రిలో 6, బెల్లంపల్లిలో 4, కాసిపేటలో 2, రామకృష్ణాపూర్‌లో 3 ట్యాంకర్లను పెట్టి నీటిని సరఫరా చేశారని గుర్తు చేశారు. ఇటువంటి కాక కుటుంబాన్ని పట్టుకొని వాళ్ళు ఏం చేసింన్రు అనడం మీకు సిగ్గుగా లేదా అని ప్రశ్నించారు. వినోద్ కార్మిక మంత్రిగా ఉన్నప్పుడు వర్షాలతో వరిపంట నష్టపోతే రైతులకు రూ.1000 కోట్లు తెప్పించి రైతులకు పరిహారం ఇప్పించాదని అన్నారు. కాకా నాయకత్వంలో వివేక్ వినోద్‌లు జైపూర్‌లో 1200 మెగావాట్ల పవర్ ప్లాంట్ పెట్టించారని, గోదావరిఖని వెళ్లాలంటే రోడ్డు మార్గం లేక ప్రజలు ఇబ్బంది పడుతున్న సమయంలో వెంకటస్వామి గోదావరిపై వంతెన వేయించారని తెలిపారు. మంచిర్యాల రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి, రాళ్ల వాగు వంతెన, రాయపట్నం వాగుపై వంతెన వేయించింది కూడా కాకా కుటుంబమే అన్నారు. కార్మికులకు రూ.500 కోట్లు ఐటి రద్దు చేపించి, సింగరేణి కార్మికులకు పెన్షన్ ఇప్పించిన ఘనత కాకా కుటుంబానిదే అన్నారు. కాకా కుటుంబం నుండి పెద్దపల్లి పార్లమెంటు అభ్యర్థిగా వంశీకృష్ణ పోటీ చేస్తుంటే అతని గురించి పిచ్చిపిచ్చి మాటలు మాట్లాడుతున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు ఎండి ఆఫీస్, ఆలం శంకర్, ఆకు దారి శ్రీనివాస్, పోలు శ్రీనివాస్, కడలి శ్రీనివాస్ రావు, సోతుకు ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

నీటి ఎద్దడి నివారణకు ముమ్మర చర్యలు

నవతెలంగాణ-జైపూర్

మండల పరిధిలో ఎక్కడ కూడా తాగు నీటి ఇబ్బందులు తలెత్తకుండా ముమ్మర చర్యలు చేపడుతున్నట్లు స్థానిక ఎంపీడీఓ సత్యనారాయణ తెలిపారు. టేకుమట్ల, ఇందారం, గంగిపల్లి గ్రామాలలో గురువారం పర్యటించిన ఆయన నీటి సరఫరా తీరుపై గ్రామస్థులను అడిగి తెలుసుకున్నారు. ఇందారం గ్రామ పంచాయతి శివాలయం ఏరియాలో గల బోరు బావిలో విద్యుత్ మోటర్ చెడిపోవడంతో పాటు పైపుల మధ్యలో ఇరుక్కుపోయినట్లు గుర్తించారు. అయినప్పటికీ నీటి సమస్య ఉత్పన్నం కాకుండా మిషన్ భగీరథ పైప్‌లైన్ ద్వార నీటి సరఫరా సాగుతున్నట్లు తెలిపారు. గంగపల్లి, టేకుమట్ల గ్రామాలలో నీటి సరఫరాలో సమస్యలను గుర్తించి పునరుద్ధరణ పనులు చేపట్టినట్లు తెలిపారు. తప్పదనుకుంటే వ్యవసాయ బోరు బావుల ద్వార నీటి సరఫరా చేస్తామన్నారు. గ్రామ పంచాయతీల పరిధిలో ఎక్కడ నీటి ఇబ్బంది ఏర్పడినా వెంటనే ప్రత్యామ్నయ ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు మండల పరిధిలో గల వివిధ గ్రామ పంచాయతీ శివారుల్లో గల వ్యవసాయ బోరు బావులను గుర్తించడం జరిగిందని తెలిపారు. తప్పనిసరి పరిస్థితులు ఎదురైతే వ్యవసాయ బోరు బావుల నుంచి తాగు నీటిని సరఫరా చేయనున్నట్లు తెలిపారు. వ్యవసాయ బోరు బావుల నీరు తాగడానికి ముందుగా టెస్ట్ చేయించిన తరువాత నీటిని సఫరా చేయనున్నట్లు తెలిపారు. మండల పరిధిలో ఎక్కడ కూడా తాగు నీటికి ఇబ్బంది లేదని ఆయన తెలిపారు.

జిల్లా వ్యాప్తంగా ఘనంగా రంజాన్ పండుగ



నవతెలంగాణ-లక్షెట్టిపేట

పట్టణంలో ముస్లింలు రంజాన్ పండుగను గురువారం ఘనంగా జరుపుకున్నారు. 30 రోజుల పాటు ఉపవాస దీక్షలు చేసిన ముస్లింలు పవిత్ర రంజాన్ సందర్భంగా కొత్త వస్త్రాలు ధరించి ఉదయం ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పట్టణంలోని ముస్లింలందరూ ప్రత్యేక ప్రార్థనలతో నమాజ్ ముగించుకొని అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకొని రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. రంజాన్ ఈద్-ఉల్-ఫితర్ పండుగ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు ఈద్గా వద్ద శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ నలమాస్ కాంతయ్య, వైస్ చైర్మన్ పొడేటి శ్రీనివాస్‌గౌడ్, లక్షెటిపేట మైనార్టీ అధ్యక్షుడు, కోఆప్షన్ సభ్యులు సయ్యద్ షాహిద్ అలీ, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు మహమ్మద్ ఆరిఫ్, నవాబ్ ఖాన్ పాల్గొన్నారు. లక్షెట్టిపేట ఎస్ఐ పి.చంద్రకుమార్ ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా బందోబస్తు నిర్వహించారు.

రామకృష్ణాపూర్ : రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని పట్టణంలోని ఈద్గా మైదానంలో ప్రత్యేక ప్రర్థనలు చేసిన ముస్లిం సోదరులకు స్థానిక ఎమ్మెల్యే వివేక్ వేంకట స్వామి రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జన్నారం : మండలంలోని ఆయా గ్రామాల్లో గురువారం రంజాన్ పండుగ సందర్భంగా ముస్లీంలు ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థలను నిర్వహించారు. రంజాన్ వేడుకల్లో ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, బీఆర్ఎస్ ఖానాపూర్ ఇన్‌చార్జి జాన్సన్ నాయక్ ముస్లిం సోదరులకు వేరువేరుగా శుభాకాంక్షలు తెలిపారు.



జన్నారంలో..



రామకృష్ణాపూర్‌లో..

ముస్లిం సోదరులు ఇండ్లలో ఇచ్చిన విందలలో పాల్గొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముజాఫర్ అలీ ఖాన్, నాయకులు, కలిందర్ ఖాన్, మున్వర్ అలీ ఖాన్, బీఆర్ఎస్ నాయకులు, ఫజల్ ఖాన్, మాజీ కోఆప్షన్ సభ్యులు ఫసియుల్లా, ఇసాక్, ఖజారుద్దీన్, రజాక్, షాకీర్ పాల్గొన్నారు.

మందమర్రి : రంజాన్ పండుగను పురస్కరించుకొని గురువారం మార్కెట్‌లోని ఈద్గాలో ముస్లిం సోదరులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. సమస్త మానవులందరూ సుఖశాంతులతో ఉండాలని దువా చేసారు. ఈ కార్యక్రమంలో చెన్నూరు ఎమ్మెల్యే డాక్టర్ వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ ముస్లిం సోదరులు అందరికీ రంజాన్ పర్వదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మత పెద్దలు మౌలానా ఆజాం అలీ, గులాం మునీర్, ఎండి అబాస్, అమీన్, మజార్, సలావుద్దీన్, అజారుద్దీన్ పాషా పాల్గొన్నారు.

మార్మోగిన సేవాలాల్ నామస్మరణ

నవతెలంగాణ-ఇంద్రవెల్లి

బంజారాల ఆరాధ్య దైవం పౌరాదేవి, సేవాలాల్ మహారాజ్ ఆయన జయంతిని పురస్కరించుకుని నార్నూర్ మండలం కొత్తపల్లి దేవస్థానం నుంచి బంజారాలు పాదయాత్రగా బయలుదేరారు. గురువారం మండల కేంద్రానికి పాదయాత్ర చేరుకుంది. మండల కేంద్రంలో రాధాకృష్ణ మందిరంలో బస చేశారు. అక్కడి నుంచి శంకర్‌గూడ గ్రామంలో భక్తులకు బంజారా సంఘం నాయకులు పవార్ దేవిదాస్, మాజీ సర్పంచ్ జమున నాయక్, రాథోడ్ రాధిక ఆధ్వర్యంలో మంచినీటి సౌకర్యంతో పాటు ఫలహారాన్ని అందించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఒక నెల కఠిన ఉపవాస దీక్షలు చేపట్టిన తరువాత నియమ నిష్టలతో సేవాలాల్ నామస్మరణతో ఎలాంటి పాద రక్షకాలు ధరించకుండా సుమారు 250 కిలోమీటర్లు కాలినడకన వెళ్లడం ఆనవాయితీగా వస్తోందన్నారు. ఈ నెల వచ్చే రామనవమి నాడు సేవాలాల్ మహారాజ్ ఆలయంలో సాంప్రదాయ పూజలు చేసిన అనంతరం దీక్షను విరమింప చేయడం జరుగుతుందన్నారు. ఈ పౌరాదేవి దేవస్థానానికి ఉమ్మడి రాష్ట్రంతో పాటు మహారాష్ట్ర, కర్నాటక తదితర రాష్ట్రాల నుంచి భక్తులు తండోప తండాలుగా తరలి వస్తారు.

రైతులను అడ్డుపెట్టుకొని రాజకీయం చేయడం సరికాదు

నవతెలంగాణ-కడెం

రైతులను అడ్డు పెట్టుకుని బీఆర్ఎస్ నాయకులు రాజకీయాలు చేయడం సరికాదని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ మండలంలోని సదర్మాట్ కాల్వకు నీటిని విడుదల చేయాలని, గతంలోనే నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తం కుమార్‌రెడ్డి అదేవిధంగా ఇన్‌చార్జి మంత్రి సీతక్క దృష్టికి తాము తీసుకెళ్లామని తెలిపారు. గురువారం సదర్మాట్‌కు నీటిని విడుదల చేయాల్సి ఉండగా రైతులను అడ్డుపెట్టుకొని బీఆర్ఎస్ నాయకులు ధర్నా చేయడం ఏంటని ప్రశ్నించారు. త్వరలోనే కడెం ప్రాజెక్టు మరమ్మతుల పనులను కూడా వేసవికాలం పూర్తయ్యేలోపే పూర్తి చేయడం జరుగుతుందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల ప్రభుత్వమని ఇది ప్రజా ప్రభుత్వమని తెలిపారు. సదర్మాట్‌కు నీటిని విడుదల చేయాలని కోరిన కారణంగా నీటిని విడుదల చేయడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తం కుమార్ రెడ్డి, మంత్రి సీతక్కకు ఎమ్మెల్యే బొజ్జు పటేల్ కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా మహాత్మ జ్యోతిబాపూలే జయంతి





నవతెలంగాణ-నిర్మల్

మహాత్మా జ్యోతిబాపూలే 197వ జయంతిని నిర్మల్ జిల్లా కేంద్రంలోని బీసీ సంక్షేమ సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు డా. ఉప్పు కృష్ణంరాజు ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. భారత దేశంలో బడుగు, బలహీన వర్గాలకు చెందిన ప్రజలు అన్ని రంగాల్లో ముందుకు సాగుతున్నారంటే దానికి కారణం మహాత్మా జ్యోతిబా పూలే చేసిన త్యాగఫలమని కొనియాడారు. ప్రతి ఒక్కరికి విద్య అవసరమని ఎలుగెత్తి చాటిన మహాత్ముడు పూలే అని అన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం కోకన్వీనర్లు సిరికొండ రమేష్, కత్రోజ్ అశోక్‌చారి, కొట్టురి కిషన్, కార్యనిర్వాహక అధ్యక్షులు మార్కంటి జీవన్, అధ్యక్షులు ఎంబడి చంద్రశేఖర్, బీసీ యువజన నాయకులు నరేష్ పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో...

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని టీఎన్జీఓ భవనంలో మహాత్మ జ్యోతిబాపూలే జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు నామత్కర్ నవీన్, ఉపాధ్యక్షులు, సంతోష్, సత్యం, సాయి పాల్గొన్నారు.

తెలంగాణ ఆదివాసీ విద్యార్థి సంఘం ఆధ్వ ర్యంలో...

తెలంగాణ ఆదివాసీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో మహాత్మ జ్యోతిభా పూలే జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పూలే చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్ష, కార్యదర్శులు సంతోష్, సత్యం, శేఖర్ పాల్గొన్నారు.

టీఎన్‌జీవోస్ ఆధ్వర్యంలో...

టీఎన్‌జీవోస్ ఆధ్వర్యంలో మహాత్మా జ్యోతిబాపూలే జయంతి వేడుకలను తమ సంఘ భవనంలో గురువారం ఘనంగా నిర్వహించారు. జ్యోతిభా పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జ్యోతిభా పూలే చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో అధ్యక్షులు వెలమల ప్రభాకర్, కార్యదర్శి కూడాల రవికుమార్, నాయకులు ఎస్.మోహన్‌రెడ్డి, బి.శ్రీనివాస్, అరుణ్ కుమార్, సాయికృష్ణ, ఎం.గంగాధర్, అశోక్, సుధాకర్, సుకుమార్, కిషన్, డి.రాములు, ఎస్.రాజన్న, వెంకటస్వామి, వై. సాయన్న, శంకర్ పాల్గొన్నారు.

కడెం : భారతదేశంలో అణగారిన వర్గాల అభ్యున్నతికి నిరంతరం కృషి చేసిన మహనీయుడు మహాత్మ జ్యోతిబాపూలే అని ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షులు సునారికారి రాజేష్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని హరిత రిసార్ట్స్‌లో మహాత్మ జ్యోతిభా పూలే జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ భారతదేశంలో అంటరానితనాన్ని పూర్తిగా ఖండించి సమసమాజ నిర్మాణం కొరకు అహర్నిశలు కృషి చేసినటువంటి గొప్ప నాయకుడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మాజీ కడెం సర్పంచ్ చిట్యాల చిన్నయ్య అంబేద్కర్ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు అర్ల రమేష్, ఐఎఫ్‌టీయూ జిల్లా కోశాధికారి దుర్గం లింగన్న, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు భూక్య రమేష్, న్యాయవాది పసుల రాజలింగం పాల్గొన్నారు.

లక్ష్మణచాంద : మహాత్మా జ్యోతిబాపూలే జయంతి వేడుకలను రాచపూర్ జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సంతోష్ మాట్లాడుతూ ఆయన ఒక సంఘసంస్కరణ వాదిగా, సామాజిక తత్వవేత్తగా, బాలిక విద్య ప్రోత్సాహకునిగా, పీడిత బహుజన బాంధవుడిగా, సమాజానికి ఎంతగానో కృషి చేశారని అన్నారు. మానసిక వికాసం కేవలం విద్య ద్వారానే జరుగుతుందని, క్రమశిక్షణతో కూడిన విద్య గొప్ప స్థాయిలో ప్రతి ఒక్కరిని నిలబెడుతుందని అన్నారు. ఆయన అడుగుజాడల్లో నడవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏటీపీ నారాయణ, అధ్యాపకులు నాగరాజు, లావణ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

జిల్లా తైక్వాండో అసోసియేషన్ నూతన కమిటీ ఎన్నిక



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లా తైక్వాండో అసోసియేషన్ నూతన కమిటీని గురువారం ఏకగ్రీవంగా ఎన్నికున్నారు. జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో తైక్వాండో అసోసియేషన్ జిల్లా జనరల్ బాడీ సమావేశాన్ని నిర్వహించి, అనంతరం ఎన్నికలను నిర్వహించారు. ఎన్నికల అబ్జర్వర్‌గా తెలంగాణ రాష్ట్ర తైక్వాండో అసోసియేషన్ నుంచి సంతోష్ ఎన్నికల అధికారిగా ఏ.కృష్ణ ప్రసాద్ ఎలక్షన్ కమిటీ చైర్మెన్ జి.వెంకటస్వామి, జిల్లా ఒలంపిక్ సంఘం కన్వీనర్ పార్థసారథి, జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అబ్జర్వర్ రాజు ఆధ్వర్యంలో ఎన్నికలను నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యక్షునిగా వీరేష్, ఉపాధ్యక్షులుగా శశాంక్, పి.శివప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా శృతి, సహాయ కార్యదర్శిగా తెలంగ్ అజయ్ కుమార్, రాథోడ్ వనిత, కోశాధికారిగా మాధవి, సభ్యులుగా మహేష్, సాగర్, జి.శివకుమార్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం ఎన్నికైన సభ్యులను శాలువాతో సన్మానించి, శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా నూతన అధ్యక్షునిగా ఎంపికైనా వీరేష్ మాట్లాడుతూ జిల్లాలో తైక్వాండో క్రీడాభివృద్ధికి కృషి చేస్తామన్నారు. సభ్యులందరి సహకారం తీసుకొని త్వరలో ప్రత్యేక వేసవి శిబిరాలను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కబడ్డీ సంఘం ప్రధాన కార్యదర్శి రాష్ట్రపాల్, జిల్లా హ్యాండ్ బాల్ సంఘం కార్యదర్శి హరిచరణ్, పేట సంఘం నాయకులు స్వామి, దయానంద రెడ్డి, గుండి మహేష్ పాల్గొన్నారు.

సంక్షేమ ఫలాలే గెలిపిస్తాయి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

గత పదేండ్లుగా నరేంద్ర మోడీ ప్రవేశపెట్టిన సంక్షేమ ఫలాలే బీజేపీ అభ్యర్థిని గెలిపిస్తాయని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు, మాజీ జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ సుహాసినిరెడ్డి అన్నారు. గురువారం కైలాస్‌నగర్ కాలనీ ఆంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. అనంతరం కాలనీలో ఇంటింటికి తిరుగుతూ నరేంద్ర మోడీ ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలను గురించి వివరించారు. అనంతరం లాభర్తీ సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా బీజేపీ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు పొందిన లబ్ధిదారులను కలిసి వారి మద్దతు కోరారు. ఆమె వెంట నాయకులు రాకేష్, కాంత, అనిల్, పవన్, రాహుల్, దామోదర్, దీపక్ ఉన్నారు.